# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 186 పేజీలు : 8 వెల : రూ.2/- శనివారం 01 ఆగస్టు 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీజీ

**●ప్రధాని ట్వీట్‌ను రీ ట్వీట్ చేసిన చంద్రబాబు**



**అమరావతి,మన జనప్రగతి జులై 31:** ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. 'రేపు భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నాం' అంటూ ఏపీ పర్యటనపై ఎక్స్‌లో ప్రధాని పోస్ట్ చేశారు. ఉత్తరాంధ్రకు మౌలిక సదుపాయాల కల్పనలో కీలక అడుగు పడుతోందని చెప్పారు. ప్రధాని పోస్ట్‌ను ట్రాక్ చేస్తూ సీఎం చంద్రబాబు రీ పోస్ట్ చేశారు. 'ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది... మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీ జీ' అంటూ పోస్టు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని, ఉత్తరాంధ్రకు గేట్‌వేగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిలుస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

## జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్ట్ విధ్వంసం

- ● పోలవరాన్ని ప్రతిష్టగా తీసుకుని పూర్తి చేస్తున్న చంద్రబాబు
- ● జగన్ అధికారంలోకి రాకుండావుండివుంటే పరిస్థితి మరోలా ఉండేది
- ● చనిపోయిన వ్యక్తిని కాదని...చంపిన వ్యక్తిని పరామర్శించడమా
- ● మందీమార్బలాన్ని వేసుకుని బలప్రదర్శనకు వెళ్లడమేంటి
- ● సీనియర్ నేత బొత్స అయినా జగన్‌కు సూచనలు చేయాలి
- ● మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు


2లో

## సర్ ముసాయిదా ఓటరు జాబితా విడుదల

**- 3.71 కోట్ల మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పణ**




**అమరావతి,మన జనప్రగతి జులై 31:** ఏపీలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ముసాయిదా ఓటరు జాబితా విడుదల అయింది. 3.71 కోట్ల మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారని సీఈవో వివేక్ యాదవ్ తెలిపారు. ఎన్నికల సంఘం తెలిపిన వివరాల ప్రకారం.. మిగతా2లో...

## కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు

- ●ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్లు
- ●పిఎం కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు
- ●కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జులై 31:** కేంద్ర కేబినెట్ నేడు రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. మిగతా2లో...





## మహిళా ఎస్ఐపై వైకాపా తీరు ఆక్షేపణీయం

**వైకాపా గుండాలపై చర్యలు తప్పవన్న లోకేశ్**

**అమరావతి,మన జనప్రగతి జులై 31:** చట్టాన్ని అతిక్రమించి మహిళా అధికారిపై దాష్టీకానికి ఒడిగట్టిన వైకాపా గూండాలపై కఠిన చర్యలు తప్పవని మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. శ్రీకాకుళంలో విధుల్లో ఉన్న మహిళా ఎస్ఐపై వైకాపా నాయకులు ప్రవర్తించిన తీరు తీవ్ర మిగతా2లో...

## ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్టు గేమ్ ఛేంజర్

**- అంతర్జాతీయ విమానాశ్రయంతో మారనున్న ఉత్తరాంధ్ర రూపురేఖలు**

**- రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి.**


2లో

## విశాఖపట్నం ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు..



**విశాఖపట్నం, మన జనప్రగతి జులై 31:** భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఋషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో "కర్టెన్ రైజర్" కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆగస్టు 1న భారత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం మిగతా2లో...

**● మన భవిష్యత్తుకు చుక్కాని భోగాపురం ఎయిర్‌పోర్ట్ ● ఋషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో ఘనంగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ ● ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ● ఋషికొండ తీరంలో అలరించిన సాండ్ ఆర్ట్, సాంస్కృతిక వేడుకలు.. ● ఆకర్షణీయంగా నిలిచిన భోగాపురం ఎయిర్పోర్ట్ నమూనాతో రూపొందించిన సైకత శిల్పాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సెల్ఫీ పాయింట్లుటూరిజం, కనెక్టివిటీతోనే లక్షలాది ఉద్యోగాలు.. ● అభివృద్ధి బాటలో ఉత్తరాంధ్ర.. పర్యాటక శోభతో మెరిసిన ఋషికొండ: మంత్రి కందుల దుర్గేష్**

## జన నేతకు కన్నీటి వీడ్కోలు

**పెద్ది సుదర్శన్‌రెడ్డి అంతిమ యాత్రకు వేలాది జనం**

**అధికార లాంఛనాలతో అంత్యక్రియలు**

**మంత్రి సీతక్క, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నివాళి**


2లో

## నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

**- కల్వకుంట్ల కవిత డిమాండ్**



**హైదరాబాద్,మన జనప్రగతి జులై 31:** కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ చట్టాలను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో మిగతా2లో...

# జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్ట్ విధ్వంసం

**కాకినాడ,మన జనప్రగతి జులై 31:**జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్టు నిర్వీర్యమైందని, దానిని పూర్తి చేసే క్రమంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా సాగుతోందని ఏపీ జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పోలవరం ఎడమ కాల్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జగన్‌కున్న క్రెడిట్ చోరీ జబ్బును అందరికీ అంటించాలని చూస్తున్నాడని ఆరోపించారు. పోలవరం నుంచి 3 వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధవళేశ్వరంకు ఎగువన నీటి నిల్వ కోసం, ఒక్క ప్రాజెక్టు కూడా లేకపోవడం చూసి సర్ ఆర్థర్ కాటన్ మనవరాలు ఆవేదన చెందారని చెప్పారు. నాడు చంద్రబాబు ప్రతి సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశారని వివరించారు. 2019లో ప్రభుత్వం మారకుండా ఉండి ఉంటే, 2024 నాటికి పోలవరం పూర్తయి అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు గోదావరి జలాలు వెళ్లి ఉండేవని అన్నారు. క్క ఛాన్స్ అంటూ గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చి పోలవరాన్ని ధ్వంసం చేసి, డయాఫ్రం వాల్‌ను విధ్వంసం చేశారని మండిపడ్డారు. నాడు ఇరిగేషన్ మంత్రులు, సీఎం, పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేమంటూ అసెంబ్లీలోనే చెప్పి, ఆ ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మొదటి పర్యటన పోలవరంకు వచ్చి 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా లక్ష్యంగా పెట్టారని వివరించారు. గత ప్రభుత్వంలో విధ్వంసం అయిన డయా ఫ్రం వాల్‌ను పూర్తి చేసి.. ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులను వేగవంతం చేశామని అన్నారు. పోలవరం పూర్తయ్యేలోగా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా నాడు చంద్రబాబు పురుషోత్తమపట్నం లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంత సాగు, తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలకు నీరందిస్తున్నామని వివరించారు. 5 ఏళ్ళ గొడ్డలి పార్టీ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల్లో తట్ట మట్టిగానీ, రూపాయి పని గానీ చేయలేదని వైసీపీని విమర్శించారు. తమ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల వైపు కన్నెత్తి చూడని గొడ్డలి పార్టీకి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. జగన్ ఇరిగేషన్ శాఖలో రూ.18 వేల కోట్ల బకాయిలు వారసత్వంగా ఇచ్చి వెళ్లారంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలని రూ.1,800 కోట్లు ఖర్చు పెట్టి పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తున్నామని ఆయన వివరించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పోలవరం ఎడమ కాలువలో ఉన్న క్లిష్టతరమైన పనులను రెండేళ్ళలోనే పూర్తి చేశామని ప్రకటించారు. ఆగస్టులోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనుల జాప్యం నేపథ్యంలో ఏజెన్సీలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే చర్యలు తప్పవని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందితే జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. సీదిరి అప్పలరాజు కుమారుడిని కాపాడుకుందామని అనేక తప్పులు చేశారు. నిందితుడిని కాపాడుతూ జగన్ ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఎందుకు మౌనంగా ఉన్నారు? ఆయన అయినా జగన్‌కి హితవు చెప్పాలి. అప్పలరాజుకు పరామర్శ పేరుతో బలప్రదర్శన నిర్వహించారు. మహిళా ఎస్సైపై వైకాపా నేతల దాడి హేయమైన చర్య. జైలు వద్ద జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి. దానయ్య కుటుంబానికి ఆయన క్షమాపణ చెప్పాలి. భోగాపురం విమానాశ్రయాన్ని జగన్ వ్యతిరేకించారు. ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదు. మోదీ-చంద్రబాబు సారథ్యంలో ఎయిర్‌పోర్టు సిద్ధమైందని నిమ్మల రామానాయుడు అన్నారు.ప్రపంచంలో ఎక్కడైనా చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడం చూశాం గానీ, హత్య చేసిన వ్యక్తిని పరామర్శించడం వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కే చెల్లిందని మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లాలోని అన్నవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇది పరామర్శ యాత్రగా కాకుండా, బలప్రదర్శన యాత్రగా మాజీ సీఎం జగన్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ పండగ వాతావరణంలో ఉంటే.. వైఎస్ జగన్ ఓర్వలేనితనంతో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం నీరు పారించాలని చూస్తుంటే, గొడ్డలి పార్టీ రక్తాన్ని పారించాలని చూస్తోందని మంత్రి నిమ్మల మండిపడ్డారు.

# ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్టు గేమ్ ఛేంజర్

**భోగాపురం, మన జనప్రగతి జులై 31:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర భవిష్యత్తు, ముఖచిత్రం పూర్తిగా మారిపోనుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అల్లూరి సీతారామరాజు భోగాపురం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, ఉపాధి, రవాణా, పర్యాటకం, సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడే అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మూడు లక్షలకు పైగా ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రజల రాకపోకలకు ఇప్పటికే వేల బస్సులను ఏర్పాటు చేశామని, ప్రజా ప్రతినిధులు కూడా తమ సొంత వాహనాలతో పాటు మినీ బస్సులను ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి చేతులమీదుగా రూ. 17,900 కోట్ల ప్రాజెక్టులకు ప్రారంభం కానున్నాయన్నారు. ప్రధాన మంత్రి భోగాపురం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం, ఉత్తరాంధ్ర అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు సమాచార,పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో భారీ ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. శ్రీకాకుళం,విజయనగరం, విశాఖపట్నం నగరాల్లో సుమారు 200 హోర్డింగ్స్, 50 ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా డ్రోన్ల ద్వారా కూడా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందుకోసం 5 డ్రోన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా డిజిటల్,సోషల్ మీడియా వేదికల ద్వారా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాధాన్యత, ఉత్తరాంధ్రకు రానున్న అభివృద్ధి అవకాశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని మంత్రి పార్థసారథి వివరించారు. విమానాశ్రయంతో ఎగుమతులకు కొత్త ఊపు లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. భోగాపురంఎయిర్ పోర్టులో 25,000 మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యం కలిగిన టెర్మినల్ అందుబాటు లోకి రావడంతో ఉత్తరాంధ్ర నుంచి దేశ, విదేశాలకు ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ విమానాశ్రయం ద్వారా ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక, వాణిజ్య రంగాల్లో గణనీయమైన మార్పులు వస్తాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు, దేశాలకు వలస వెళ్లే ప్రాంతంగా ఉన్న ఉత్తరాంధ్ర, భవిష్యత్తులో ఇతర ప్రాంతాల వారికి కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగు తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. విమానాశ్రయం ద్వారా ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ ఏర్పడి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు.పోలవరం నీటితో ఉత్తరాంధ్రకు మరింత ప్రయోజనం కలుగుతుందని ఆగస్టు 14 న పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నుంచి ఉత్తరాంధ్రకు నీటిని తీసుకువచ్చే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగు నీరు, తాగు నీరు, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. పాత్రికేయుల సమావేశం లో సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్. విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు..

(మొదటి పేజీ తరువాయి)

జరగనున్న నేపథ్యంలో.. పర్యాటక శాఖ చేపట్టిన ఈ కర్టెన్ రైజర్ కార్యక్రమం ఆహుతులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "ఉత్తరాంధ్ర ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాలంటే అభివృద్ధి, రవాణా అనుసంధానత (కనెక్టివిటీ) ఎంతో అవసరం. రైలు, రోడ్డు, ఆకాశ, జల మార్గాల ద్వారా సమర్థవంతమైన కనెక్టివిటీ ఏర్పడితే పరిశ్రమలు వస్తాయి, పర్యాటకరంగం విస్తరిస్తుంది, తద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన జరుగుతుంది. ఈ ప్రాంతానికి అంతర్జాతీయ విమానాశ్రయం రావడం ఎంతో ఆనందదాయకం. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" అని నామకరణం చేశారని గుర్తుచేస్తూ, ప్రజా కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని" మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. విమానాశ్రయ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతన్నలకు కృతజ్ఞతలు తెలుపుతూ సైకత శిల్పంలో "థాంక్స్ ఫార్మర్స్" అని సముచితంగా పొందుపరచడం అభినందనీయం అని మంత్రి దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నమూనాను సైకత శిల్పంగా మలచడం అద్భుతంగా ఉందని కొనియాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పచ్చదనం, పరిశుభ్రత, పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తూ ఋషికొండ బీచ్ 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు పొందడం గర్వకారణం అని పేర్కొన్నారు. బీచ్‌ను నిరంతరం శుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికుల శ్రమ వల్లే ఈ గుర్తింపు కొనసాగుతోందని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పర్యాటకులు ఎవరూ ప్లాస్టిక్ వ్యర్థాలను బీచ్‌లో పడేసి దీని ఔన్నత్యాన్ని దెబ్బతీయవద్దని, ప్లాస్టిక్ వల్ల గుర్తింపు కోల్పోతే రాష్ట్రానికే అప్రతిష్ట వస్తుందని హితవు పలికారు. ఋషికొండ బీచ్ వద్ద చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల ప్రయోజనాలు కాపాడే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి దుర్గేష్ భరోసా ఇచ్చారు.అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు - సెల్ఫీ పాయింట్లు:దాదాపు 500 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ట్రస్ట్ తరఫున చిన్నారులు చేసిన అద్భుతమైన నృత్య కార్యక్రమాలను, గిరిజన నృత్య కళారూపాలను మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. సాంప్రదాయ కోలాటంతో తనకు స్వాగతం పలికిన మహిళామణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అనంతరం "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు.. మన ఎయిర్‌పోర్ట్ మన భవిష్యత్" పేరుతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద, సైకత శిల్పాల వద్ద మంత్రి కందుల దుర్గేష్ ఉత్సాహంగా ఫోటోలు దిగారు. అక్కడ ఏర్పాటు చేసిన సిగ్నేచర్ వాల్‌పై తన సంతకాన్ని తెలుగులో చేశారు.అంతర్జాతీయ పర్యాటకుల రాకను పెంచేందుకు, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌తో స్థానిక పర్యాటక రంగానికి ఉన్న అనుసంధానాన్ని వివరిస్తూ పర్యాటక శాఖ రూపొందించిన కార్యక్రమాలు, ఏపీ పర్యాటక విశేషాల ప్రదర్శనలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ విజయవంతమైన కార్యక్రమాన్ని నిర్వహించిన ఉత్తరాంధ్ర టూరిజం శాఖాధికారులను మంత్రి దుర్గేష్ అభినందించారు.ఈ వేడుకలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి, టూరిజం అండ్ ట్రావెల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ మోహన్, హోటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్, డివిఎం జగదీష్, జనసేన పార్టీ నాయకులు సందీప్, శ్రీనివాస్ మరియు ఇతర పర్యాటక శాఖ అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద ఎత్తున పర్యాటకులు పాల్గొన్నారు.

# 21మంది వైకాపా నేతలపై కేసు

**శ్రీకాకుళం,మన జనప్రగతి జులై 31:**

మహిళా ఎస్సైతో అనుచితంగా ప్రవర్తించిన వైకాపా నేతలపై ఆమదాలవలస పోలీసులు కేసు నమోదు చేశారు. వైకాపా అధ్యక్షుడు జగన్ శ్రీకాకుళం పర్యటనలో బూర్జ ఎస్సై ప్రవల్లికపై ఆమదాలవలస వైకాపా ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్, ఆయన అనుచరులు అనుచితంగా ప్రవర్తించి దౌర్జన్యం చేశారు. ఈ ఘటనలో మొత్తం 21 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చింతాడ రవికుమార్‌ను ఏ1గా పేర్కొన్నారు.

## కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్‌లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఎలోటింగ్ సోలార్ ప్యానెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు కేటాయించి నట్టు మంత్రి తెలిపారు. 2026-2030 మధ్య కాలానికి ఈ మొత్తాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక సముద్ర మంథన్ పథకానికి 84,084 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. 2030-31 వరకూ ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. సముద్రం అడుగున దాగున్న ముడిచమురు, సహజవాయువు వనరుల గుర్తింపు కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఖేలో ఇండియా పథకానికి సంబంధించి కేంద్రం రాబోయే ఐదేళ్ల కాలానికి రూ.29,054 కోట్లు కేటాయించిందని కూడా మంత్రి తెలిపారు. యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నుల్స్ నిర్మాణానికి 9,779 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

## మహిళా ఎస్ఐపై వైకాపా తీరు ఆక్షేపణీయం

(మొదటి పేజీ తరువాయి)

ఆక్షేపణీయమని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో మహిళల భద్రత, గౌరవంతో చెలగాట మాడితే సహించేది లేదని స్పష్టం చేశారు. మహిళలను అవమానించడం, రాక్షస ఆనందం పొందడం వైకాపా డీఎన్ఏలోనే ఉందని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత తల్లిని, చెల్లిని గెంటేసిన చరిత్ర జగన్ రెడ్డిదైతే... సమాజంలో కనిపించిన ప్రతి మహిళను అవమానించడం వైకాపా నాయకుల సంస్కృతిగా మారిందని ధ్వజమెత్తారు. విధుల్లో ఉన్న మహిళా అధికారిపై దురుసుగా ప్రవర్తించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని తేల్చి చెప్పారు.

## సర్ ముసాయిదా ఓటరు జాబితా విడుదల

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో 89.22 శాతం మంది ఫారాలు ఇచ్చారు. 15.22 లక్షల మందిని మృతులుగా గుర్తించారు. 22.30 లక్షల మంది శాశ్వతంగా మారినట్లు లేదా గైర్హాజరైనట్లు నిర్ధరించారు. 7.37 లక్షల మంది పేర్లు రెండు, మూడు చోట్ల నమోదైనట్లు తేల్చారు. ఒకటి కంటే ఎక్కువచోట్ల ఓటు ఉన్నవారి పేరు ఒకే చోట కొనసాగించారు. నిజమైన ఓటర్లు ఫారం-6తో మళ్లీ నమోదు చేసుకునే అవకాశముంది. జులై 31 నుంచి ఆగస్ట్ 30 వరకు అభ్యంతరాలను స్వీకరించి.. అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజక వర్గాల ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. నోటీసు, విచారణ లేకుండా ఏ ఓటరు పేరునూ తొలగించబోమని అధికారులు తెలిపారు. అర్హులైన ఎవరూ ఓటు హక్కుకు దూరం కాకూడదనే నిర్ణయానికి ఈసీ కట్టుబడి ఉందని సీఈవో తెలిపారు. అనర్హులు చేరకుండా పారదర్శక ప్రక్రియకు కట్టుబడి ఉన్నామన్నారు.

## జన నేతకు కన్నీటి వీడ్కోలు

**నర్సంపేట, మన జనప్రగతి జులై 31:**నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతికకాయానికి శుక్రవారం జనం కన్నీటి వీడ్కోలు పలికారు. అధికార లాంఛనాల మధ్య ప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించింది. ఈ నెల 26న గుండెపోటుతో హనుమకొండలోని రోహిణి ఆస్పత్రిలో చేరిన పెద్ది సుదర్శన్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి12:30 గంటలకు మరణించినట్టు వైద్యులు తెలిపారు. అక్కడి నుంచి ఆయన భౌతికకాయాన్ని హనుమకొండ మీదుగా నర్సంపేటకు తీసుకొచ్చారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై అడుగడుగునా పెద్దికి జనం నివాళులర్పించారు. గిర్నిబావి సెంటర్ నుంచి నర్సంపేట వరకు 10 కిలో మీటర్ల వరకు రోడ్డుపై అంతిమ యాత్ర జనసందోహంతో కొనసాగింది. పట్టణంలోని అయ్యప్ప గుడి నుంచి ప్రధాన రహదారిపై వేలాది మంది అభిమానుల నడుమ అంతిమ యాత్ర సాగింది. అక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు నల్లబెల్లిలోని పెద్ది స్వగృహానికి ఆయన మృతదేహన్ని తీసుకొచ్చారు. **నివాళులర్పించిన కేటీఆర్, హరీశ్‌రావు, మంత్రి సీతక్క** పెద్ది సుదర్శన్‌రెడ్డి భౌతికకాయానికి మంత్రి సీతక్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగుల కమలాకర్, సత్యవత్‌రాథోడ్, మాజీ ఎంపీ కవిత, ఎమ్మెల్సీలు పోచంపెల్లి శ్రీనివాసరెడ్డి, గోరెటి వెంకన్న, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డితో పాటు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో హరీశ్‌రావు, కేటీఆర్ తదితర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. వర్షం కురిసినా అభిమానులు అంతిమ యాత్రలో పాల్గొని పెద్దికి తుది వీడ్కోలు పలికారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించడంతో దానికి తగ్గ ఏర్పాట్లు చేశారు. రాత్రి 8 గంటలకు ఆయన కుమారుడు నిదర్శన్ రెడ్డి చితికి నిప్పంటించారు.

## నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రక్షణ సేన ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ కార్యక్ర మంలో ఆమె మాట్లాడారు. ఆ చట్టాలకు వ్యతిరేకంగా తమిళనాడు, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాలు తీర్మానాలు చేశాయని ఆమె గుర్తుచేశారు. కార్మికులకు, ఉద్యోగులకు, టీచర్లకు అన్యాయం జరగనివ్వబోమని ఆమె స్పష్టం చేశారు. టీఆర్ఎస్ కార్మికుల ఫ్రెండ్లీగా అండగా ఉంటుందని తెలిపారు. పరిణితి చెందిన ప్రజాస్వామ్యం అంటే ఆ దేశంలో పనిచేసే ప్రజలకు సంతోషంగా పనిచేసే వాతావరణం కల్పించాలన్నారు. ట్రేడ్ యూనియన్ అంటే రాజ్యాంగ బద్దంగా మనకు దక్కిన హక్కు అనీ, దాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో కనీస వేతనం రూ.20 వేలు ఉండాలని, సీఎం అయ్యాకేమో రూ.16 వేలు ఇస్తామంటూ రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. షెడ్యూల్ ఆఫ్ ఇండస్ట్రీస్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లను చలాన్ల పేరుతో శ్రమదోపిడీ చేస్తున్నారనీ, ఐటీ, ఫార్మా రంగాల్లో యూనియన్లు లేకపోవడంతో అక్కడా అదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ సంతోషంగా ఉన్నప్పుడే దేశం ముందుకెళ్తుందనీ, అలాంటి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆమె గుర్తుచేశారు.

## 19 యూనివర్సిటీ పాలకమండళ్లు రద్దు

### - నామినేటెడ్ సభ్యులను తొలగిస్తూ ఉత్తర్వులు

**అమరావతి,మన జనప్రగతి జులై 31:**ఏపీలోని యూనివర్సిటీల పాలనలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. 19 విశ్వవిద్యాలయాల పాలక మండళ్లను రద్దు చేస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో నియమించిన నామినేటెడ్ సభ్యులను తొలగించింది. ఈ మేరకు ఆయా విశ్వవిద్యాలయాల గవర్నింగ్ బాడీల రద్దుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. క్లాజ్-2 కింద నియమితులైన పాలక మండలి సభ్యులపై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే పదవీ రీత్యా కొనసాగుతున్న సభ్యులకు ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేసింది. క్లాజ్-1 కింద ఉన్న ఎక్స్-ఆఫిషియో సభ్యులు యథావిధిగా కొనసాగుతారని ప్రభుత్వం పేర్కొంది. విశ్వవిద్యాలయాల పాలక మండళ్ల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ)కు కొత్త పాలక మండలిని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాల్లో కూడా కొత్త పాలక మండళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

# పదవీ విరమణ పొందిన ఎస్సై సయ్యద్ సాదిక్ రహిమాన్‌ను సన్మానించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 31:-** సుదీర్ఘకాలం పోలీసుశాఖలో పని చేసి పోలీసు అధికారులు పదవి వీరమణ పొందడం అభినందనీయమని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు.కర్నూలు మూడవ పట్టణ పీఎస్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై సయ్యద్ సాదిక్ రహిమాన్ శుక్రవారం పదవి వీరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సయ్యద్ సాదిక్ రహిమాన్ ను శాలువ, పూలమాలతో జిల్లా ఎస్పీ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబాలతో సంతోషంగా గడపాలని, పదవివీరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసూదన్ రావు, ఆర్ ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, పదవీ విరమణ పొందిన ఎస్సై సయ్యద్ సాదిక్ రహిమాన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి




**గోనెగండ్ల, మన జనప్రగతి జూలై 31:-** ప్రజల సమస్యలను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం "ఒక నెలఒక నియోజకవర్గంనాలుగు పర్యటనలు" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు.శుక్రవారం ఎమ్మిగనూరులోని గోనెగండ్ల మండలంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఎమ్మెల్యే బి.వి. జయ నాగేశ్వరరెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం స్వీకరించిన వినతులపై తదుపరి వారంలో సమీక్ష నిర్వహించి, సమస్యల పరిష్కార పురోగతిని ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. భూ సమస్యలు, 22-ఏ నిషేధిత జాబితా, రీ-సర్వే వివాదాలు, తాగు నీరు, రహదారులు, విద్యుత్, బస్సు సౌకర్యం, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తామని తెలిపారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, ఆర్డీవో అరుణాదేవి, జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# చెరువులో చేపలు పట్టడానికి అవకాశం కల్పించండి



**చిట్వేలి మన జనప్రగతి జూలై 31:-** జిల్లాలో అతి పెద్ద యలమరాజు చెరువులో చేపలు పట్టుకోవడానికి గిరిజనులమైన మాకు అవకాశం కల్పించాలని చెరువు ఆయకట్టు గ్రామాల గిరిజనులు జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నాగయ్యకు వినతి పత్రం సమర్పించారు. టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ సలహా మేరకు జనసేన రాయలసీమ అధ్యక్షుడు జోగినేని మణి, చిట్వేలి మండల జనసేన నాయకుడు ఆనాల సునీల్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మత్స్య శాఖ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లమరాజు చెరువు లో చేపలు పట్టడానికి ఒకే సహకార సంఘానికి ప్రభుత్వం హక్కులు కల్పించడంతో గిరిజనులమైన మేము చేపలు పట్టడానికి అవకాశం లేక జీవన ఉపాధి కోల్పోతున్నామని అన్నారు. ప్రభుత్వ చట్టాల మేరకు దాదాపు 450 హెక్టర్ల విస్తీర్ణం కలిగిన చెరువులో చేపలు పట్టడానికి హెక్టారుకు ఒకరు చొప్పున 450 మంది సహకార సంఘంలో సభ్యులుగా చేరవచ్చు అని అన్నారు. కావున అధికారులు వెంటనే చర్యలు తీసుకుని గిరిజనులమైన మమ్ములను సొసైటీలో సభ్యులుగా చేర్చి చేపల పట్టుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నాగయ్య మాట్లాడుతూ చెరువులో చేపలు పట్టే సమస్య తీరేవరకు ఎవరూ చెరువులోకి దిగకుండా చిట్వేలి మండల రెవెన్యూ అధికారి, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్, సహకార సంఘానికి నోటీసులు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదినేని కనక రాజ, మాదినేని రాజా, పగడాల వెంకటేష్, పగడాల శివ శంకర పాల్గొన్నారు.

# నిబద్ధత కలిగిన ఆచార్యులు పి.రమాదేవి: వి.సి. ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

**కడప, మన జనప్రగతి, జులై,31,:-**బోధన, పరిశోధన, పరిపాలన విభాగాలలో నిబద్ధతతో సేవలందించిన వ్యక్తి యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు పాలెం రమాదేవి అని యోగి వేమన విద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు.ప్రొఫెసర్ గా డీన్ గా, వివిధ విభాగాల కోఆర్డినేటర్ గా డైరెక్టర్ గా , పరిశోధకురాలు విద్యార్థులకుఉత్తమ సేవలను రమాదేవి అందించారని వీసీ ప్రశంసించారు. తెలుగు శాఖ ఆచార్యులు , ఎడ్యుకేషన్ డీల్ ఆచార్య రమాదేవి పదవీ విరమణ సందర్భంగా వీసీ చాంబర్లో శుక్రవారం సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. వైవీయూ ఫైనాన్స్ ఆఫీసర్ పల్లా శ్రీనివాసులు సేవల ప్రశంసనీయంయోగివేమన విశ్వవిద్యాలయం ఫైనాన్స్ ఆఫీసర్ పల్లా శ్రీనివాసుల సేవలు ప్రశంసనీయమని ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ కొనియాడారు. విశ్వవిద్యాలయ ఆర్థికపరంగా నిలదుక్కుపోవడానికి ఆయన అందించిన సహకారం గుర్తుంచుకో తగిలిందన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. రిజిస్ట్రార్ ఆచార్య పి పద్మ, ఆచార్యులు తప్పెట రామప్రసాద్ రెడ్డి, బోధన, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.



# నకిలీ స్టాంప్ డ్యూటీ చలానా కేసు విచారణ ముగింపు

**తప్పుకు పాల్పడిన వారిపై శాఖా పరమైన చర్యలకు సిఫార్సు**

**రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టబడిన తనిఖీలకు సిఫార్సు**




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 31:-** కర్నూలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నకిలీ స్టాంప్ డ్యూటీ చలానా ఆధారంగా డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయబడిన కేసు పై వచ్చిన ఫిర్యాదు పై క్రిమినల్ మరియు శాఖ పరమైన చర్యలు చేపట్టినందుకు ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త శ్రీమతి పి.రజని కేసు విచారించి ముగించారు. శుక్రవారం ఉప లోకాయుక్త తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలుకు చెందిన టి లక్ష్మీనారాయణ 23 9 2022లో సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో నమోదైన డాక్యుమెంట్ నెంబర్ 15058/2022 సంబంధించి స్టాంపు డ్యూటీ చెల్లింపునకు సి.ఎఫ్.ఎం.ఎస్ చలానా నెంబర్ 6010405167 2022 నకిలీదని ఆరోపిస్తూ ఈ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై ఉప లోకాయుక్త ఫిర్యాదు నంబర్ 2125/2023/బి1 గా ఫిర్యాదు నమోదు చేశారు. దీనిపై విచారించిన ఉప లోకాయుక్త డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ మరియు జిల్లా రిజిస్టర్ ఆఫీస్ కర్నూల్ సమర్పించిన నివేదిక ప్రకారం కమిషనర్ మరియు ఇన్స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ వారు సంబంధిత ఎగ్జిక్యూటెంట్లు మరియు క్లైమేంట్లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఆ మేరకు కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 570/2023 కేసు నమోదు చేశారు. ప్రస్తుత మీ కేసు దర్యాప్తులో ఉంది. అదేవిధంగా తగిన పరిసరాలు లేకుండా చలానా స్వీకరించిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులపై శాఖ పరమైన చర్యలు కూడా చేపట్టబడ్డాయి. అందులో భాగంగా అప్పటి సీనియర్ అసిస్టెంట్ ఎం.ఈ. గోపాలరావు పై రెండు వార్షిక వేతన ఇంక్రిమెంట్లు నిలిపివేయాలని, జాయింట్ సబ్ రిజిస్టర్ చైతన్య రాయలపై స్వల్ప శిక్ష విధించారు. అలాగే సంబంధిత క్లైమేట్ రూ.1,21,850/- లక్షల మొత్తాన్ని ఒకటి 11 2022న చెల్లించినట్లు విచారణలో వెల్లడింది. అన్ని నివేదికలు మరియు సంబంధిత అధికారులను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు ఇప్పటికే తగిన క్రిమినల్ మరియు శాఖవరం చర్యలు చేపట్టినందుకు ఈ విషయంలో లోకాయుక్త సంస్థ ద్వారా మరియు విచారణ అవసరం లేదని ఉపలోక యొక్క అభిప్రాయపడ్డారు. దీనితో సంబంధించిన శాఖ చేపట్టిన చర్యలకు నమోదు చేస్తూ ఫిర్యాదును ముగించినట్లు ఉపలోకయుక్త శ్రీమతి రజని తెలిపారు. అదేవిధంగా భవిష్యత్తులో ఇలాంటి నకిలీ చలానాల ద్వారా పత్రాలు డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కాకుండా నివారించేందుకు ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ కమిషనర్ మరియు ఇన్స్పెక్టర్ జనరల్ రాష్ట్రంలోని అన్ని రిజిస్టర్ కార్యాలయాలకు చలానాల పరిశీలనలో మరింత అప్రమత్తత జాగ్రత్త పాటించాలని తగిన ఆదేశాలు జారీ చేయాలని ఉప్పలోకాయుక్త సిఫార్సు చేశారు

# అభివృద్ధికి నోచుకోని దేవనకొండ ఎస్సీ కాలనీ

**● అభివృద్ధికి నోచుకోని... దేవనకొండ ఎస్సీ కాలనీ**



**దేవనకొండ మన జన ప్రగతి జులై 31:** దేవనకొండ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమస్యలకు నిలయంగా మారిందని రోడ్లు, డ్రైనేజీ అధ్వానంగా ఉన్నాయని విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయని వాటి పరిష్కారానికి వెంటనే అధికారులు కృషి చేయాలని శుక్రవారం నాడు స్థానిక గ్రామపంచాయతీ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం, భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ సమస్యల పరిష్కారం కోసం డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు వై మహేంద్ర అధ్యక్షతన ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి ముకెళ్ళ అశోక్ లు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఎనిమిది పదులు కావస్తున్న నేటికీ దళిత వాడలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయని సరైన మౌలిక సదుపాయాలు లేక అక్కడ నివాసం ఉంటున్న వారు చాలా ఇబ్బందులు గురవుతున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనందు చర్చి దగ్గర నుండి కొత్త కాలనీ వైపు ప్రధాన రోడ్డు ఏప్పుడు కృంగి పోతుందోనని అక్కడ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు.ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మట్టి కోసం తవ్విన గుంత విపరీతంగా పెద్దదై పది అడుగుల్లోతుకు పైగా ఉంటుందని ఇక్కడ ప్రమాదం జరిగితే తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. వెంటనే ప్రధాన రోడ్డు నిర్మాణం చేపట్టాలని మరియు డ్రైనేజ్ ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఎస్సీ ఎస్టీ ఆవాసాలలో ఎలాంటి మౌలిక వసతుల కోసం ఎలాంటి ఖర్చుకైనా వెనకాడమని చెబుతున్న ప్రభుత్వం ఇక్కడ సిసి రోడ్లు వేయడంలో విఫలమవుతుందని పేర్కొన్నారు కాలనీలో సీ సీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని డ్రైనేజీ కాలువల నిర్మాణం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్తంభాలు కూలిపోవడానికి దాదాపు పది ,పన్నెండు సిద్ధంగా ఉన్నాయని విద్యుత్ శాఖ వారిని పరిశీలించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వారి కోరారు అనేక మంది విద్యాధికులు ఉన్న ఎస్సీ కాల నందు లైబ్రరీ పునరుద్ధరణ చేయాలని సొంత నిధులతో కాలనీవాసు నిర్మించుకుంటున్న కమ్యూనిటీ భవనంకు నిధుల కొరతతో మధ్యలోనే ఆపేశారని కమ్యూనిటీ భవనంకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు. చేయాలని అదేవిధంగా ప్రహరీ గోడ నిర్మించాలని కాలనీకి మరొక అంగన్వాడి కేంద్రం ఆశా వర్కర్ ను కేటాయించాలని కోరారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు యూసుఫ్ భాష, పాండురంగడు , కే.బీ నాగేంద్ర, మహేష్, బలరాముడు, మధు, వీర బద్రి,రంగస్వామి, ముక్కెళ్ల పరశు రాముడు.యం.నాగేంద్ర, కొత్త పల్లి అశోక్ కాలనీవాసులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణే లక్ష్యం.

**డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**పెండింగ్ కేసుల దర్యాప్తులను వేగవంతం చేయాలి**

**పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం: ఎస్పీ విక్రాంత్ పాటిల్**




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 31:-**జిల్లాలో నేర నియంత్రణే లక్ష్యంగా పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు.శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూపోలీస్ స్టేషన్‌ల వారీగా చీటింగ్ కేసులు, వైట్ కాలర్ నేరాల జాబితాను సిద్ధం చేసి వాటి దర్యాప్తు పురోగతిని నిరంతరం సమీక్షించాలన్నారు. సీఐలు, ఎస్సైలు పెండింగ్ కేసులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మిస్సింగ్ కేసులు, ప్రాపర్టీ నేరాల దర్యాప్తును పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్డన్ సెర్చ్ లు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ ల పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్, బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు "స్టాప్‌ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. సైబర్ నేరాల కేసుల విషయంలో 1930కు వచ్చిన ఫిర్యాదులు,
ఆన్‌లైన్ ఫిర్యాదులు, బ్యాంకుల్లో ఫ్రీజ్ చేసిన నగదు అంశాలను పర్యవేక్షించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యూల్ అకౌంట్లు, ఓటీపీ (ఫ్రాడ్స్), డిజిటల్ నేరాలకు సంబంధించిన కేసులపై తక్షణ చర్యలు తీసుకుని అవసరమైన చోట ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు చేయాలన్నారు. బ్యాంకుల్లో రూ.50 వేలకుపైగా ఫ్రీజ్ చేసిన నగదు ఉన్న ఫిర్యాదులపై తప్పనిసరిగా ఎఫ్ ఐ ఆర్ లు నమోదు చేసి, బ్యాంకులతో సమన్వయం చేసి బాధితులకు నగదు తిరిగి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిసియస్ పోలీసులు బృందాలు గా ఏర్పడి ప్రాపర్టీ నేరాలను చేధించాలన్నారు. మహిళలపై నేరాలు జరిగిన వెంటనే స్పందించి కేసులు నమోదు చేయడంతో పాటు నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) శ్రీ హుస్సేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీ లు వెంకట్రామయ్య, రాఘవేంద్ర, దుర్గప్రసాద్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులపై కఠినచర్యలుతీసుకోవాలి

**పత్తికొండ మన జనప్రగతి జులై 31:-** ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐతో విచారణ చేపట్టాలని, అలాగే ఈ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ కి పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ , మాజీ ఎంపీ బుట్టా రేణుక , కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపి రెడ్డి ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ , కర్నూలు మాజీ మేయర్ బి.వై రామయ్య ,కోడుమూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఓ, వైఎస్ఆర్ పార్టీ కర్నూలు జిల్లా మాజీ అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ , కర్నూల్ నగర వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు అహ్మద్ అలీఖాన్ , వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి, డీఎస్సీ నియామక ప్రక్రియపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి నిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు.



# రూ.49.90 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ



**గోరంట్ల మన జనప్రగతి జూలై 31:** గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి గ్రామంలో రూ.49.90 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంక్‌కు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్, చేనేత & జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు టీడీపీ మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.గ్రామానికి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం దోహదపడుతుందని నాయకులు తెలిపారు. రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, టీడీపీ జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, 5 మ్యాన్ కమిటీ సభ్యుడు గంగాధర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రవి నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ నబిరసూల్, బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణతో పాటు గుమ్మయ్య గారిపల్లి గ్రామ నాయకులు హరి హనుమోలు, ప్రకాష్ అనుమోలు, శంకరప్ప, నాగరాజు, పనిరాజు, డీలర్ సురేంద్ర, స్టోర్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టి. సుండుపల్లిలో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం

**- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



**టి. సుండుపల్లి,మన జనప్రగతి జూలై 31:-** వైఎస్సార్ కడప జిల్లా రాజంపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి టి. సుండుపల్లి మండల కేంద్రంలోని ఎంసీఆర్ కళ్యాణ మండపంలో శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.రాజంపేట నియోజకవర్గ పరిధిలోని రాజంపేట, టి. సుండుపల్లి, ఒంటిమిట్ట, నందలూరు, వీరబల్లి, సిద్ధవటం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వినిపిస్తూ వినతిపత్రాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ భావన, రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్ రాజు, జనసేన పార్టీ ఇన్‌చార్జి ఏటూరి శ్రీనివాస రాజు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధి పట్ల జాగ్రత్తలవసరం ర్యాలీ



**చెన్నూరు మన జనప్రగతి జూలై 31:-** డెంగ్యూ వ్యాధిపట్ల ప్రజలు జాగ్రత్తలు అవసరమని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కుమార్ రెడ్డి డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు, శుక్రవారం డెంగ్యూ మాస ఉత్సవాలు భాగంగా చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి డాక్టర్లు వైద్య సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు చెన్నూరు పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు, చెన్నూరు బస్టాండ్ లో మౌన హారంగా ఏర్పడి డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు, అలాగే అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని పరిసరాలు పరిశుభ్రత దోమల వ్యాప్తి కాకుండా ఉండాలని సూచనలు చేశారు, ప్రజలు ఎలాంటి జబ్బులొచ్చిన వెంటనే చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులను డాక్టర్లను సంప్రదించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో గ్రామీణ కేంద్రం వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు అంగన్వాడి కార్యకర్తలు హెల్త్ సూపర్వైజర్ సుబ్బరామయ్య వైద్య సిబ్బంది వెంకటరమణ వెంకటమ్మ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

# వైయస్ ఆనంద్‌రెడ్డికి నివాళులర్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్, కుటుంబ సభ్యులు





**పులివెందుల టౌన్ మన జనప్రగతి జూలై 31:-** వైఎస్ ఆనంద రెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి , సతీమణి వైయస్ భారతి రెడ్డి నివాళులర్పించారు. కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి పెదనాన్న వైయస్ ఆనంద్‌రెడ్డి గురువారం కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన పులివెందులలో తుదిశ్వాస విడిచారు.శుక్రవారం బెంగళూరు నుంచి హెలికాప్టర్ ద్వారా పులివెందులకు చేరుకొని ఆనంద్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి వైయస్ జగన్ దంపతులు ఆయన భౌతికకాయనికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి, వైయస్ మనోహర్ రెడ్డి వైయస్ మధుసూదన్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి అంజద్ భాష కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ బద్వేల్ శాసన సభ్యురాలు సుధా, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ , ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి వైసిపి నాయకులు కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.**ఘనంగా అంత్యక్రియలు** వైయస్ ఆనంద రెడ్డి అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం వైఎస్ కుటుంబ సభ్యుల సమాధుల తోటలో క్రైస్తవ పద్ధతిలో అంత్యక్రియలు చేశారు. కుటుంబ సభ్యులు కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ ప్రకాష్ రెడ్డి, వైయస్ మదన్ మోహన్ రెడ్డి, వైయస్ ప్రతాప్ రెడ్డి, దుశాంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్థికాభివృద్ధిలో అన్నమయ్య జిల్లా కీలక పాత్ర పోషించాలి

**- ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా**




**మదనపల్లె, మన జనప్రగతి జూలై 31 :-** స్వర్ణ ఆంధ్ర ఏ2047 విజన్‌కు అనుగుణంగా అన్నమయ్య జిల్లా ఆర్థికాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను శాస్త్రీయంగా రూపొందించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం (గనులు) శాఖ ముఖ్య కార్యదర్శి, తిరుపతి ఎకనామిక్ రీజన్ సీఈవో ముఖేష్ కుమార్ మీనా అధికారులకు సూచించారు.మదనపల్లె కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని 2047 నాటికి 0.9 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. బెంగళూరు, తిరుపతికి సమీపంలో ఉన్న అన్నమయ్య జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఎంఎస్ఎంఈలు, పర్యాటకం, పునరుత్పాదక ఇంధనం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నీరు, విద్యుత్ వంటి అంశాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడి అవకాశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సీపీఓ వెంకట పెద్దయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖకు మీరు అందించిన సేవలు చిరస్మరణీయం

**● పదవీ విరమణ తర్వాత ఆరోగ్యంపై దృష్టి సారించాలి: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్**



**కడప మన జనప్రగతి జూలై 31:-** క్రమశిక్షణ, అంకితభావంతో నిర్విరామంగా సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. జులై నెలాఖరున పదవీ విరమణ పొందిన వేముల పి.ఎస్ ఏ.ఎస్.ఐ ఎన్.రవి, ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.రజాక్ మియా (ఏ.ఆర్.హెచ్.సి 2492) లను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందచేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ తమ విధి నిర్వహణ కాలంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో మీ కృషి అభినందనీయమన్నారు. అప్పటి పరిస్థితులను ధీటుగా ఎదుర్కొంటూ కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహించడం మామూలు విషయం కాదని, ఎన్ని ఇబ్బందులున్నా, సమస్యలున్నా బాధ్యత అనేది పోలీస్ శాఖలో సమస్యలను అధిగమించేలా చేస్తుందన్నారు. పదవీ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు. పదవీ విరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించవచ్చని జిల్లా ఎస్.పి తెలిపారు.కార్యక్రమంలో అదనపు ఎస్.పి(పరిపాలన) కె.ప్రకాష్ బాబు ఏ.ఆర్ అదనపు ఎస్.పీ బి.రమణయ్య, ఏ.ఆర్ డి.ఎస్.పీ పి.నాగేశ్వర రావు, డి.పీ.ఓ ఏ.ఓ జి.నిజాముద్దీన్, సూపరింటెండెంట్లు ఇ.సురేష్ బాబు, ఎస్.గౌస్ పీర్ , పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ మరియు అసోసియేషన్ సభ్యులు, ఆర్.ఐ లు టైటస్, శివరాముడు, ఆర్.ఎస్.ఐ లు, పదవీ విరమణ పొందిన వారి బంధు మిత్రులు, కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నియోజకవర్గం ముసాయిదా ఓటరు జాబితా 2026 ప్రచురణ పూర్తి

**● ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి చిన్నయ్య**



**పులివెందుల మన జనప్రగతి జూలై 31:-** 129 పులివెందుల శాసనసభ నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితా 31 జూలై 2026న ప్రచురించడం జరిగిందని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి చిన్నయ్య తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఓటరు జాబితాను విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 309 పోలింగ్ కేంద్రాల లో మొత్తం 2,00,531 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుష ఓటర్లు 98,030 మంది, మహిళా ఓటర్లు 1,02,488 మంది, ఇతరులు (తృతీయ లింగం) 13 మంది ఉన్నారు.ముసాయిదా ఓటరు జాబితాను ప్రజల పరిశీలన కోసం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కార్యాలయం, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల కార్యాలయాలు, సంబంధిత బూత్ లెవల్ అధికారులు ద్వారా అన్ని 309 పోలింగ్ కేంద్రాలలో, అలాగే భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.ఓటర్లందరూ తమ పేరు మరియు ఇతర వివరాలను ముసాయిదా ఓటరు జాబితాలో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కోరడమైనది. కొత్తగా పేరు చేర్పు, ఇప్పటికే ఉన్న నమోదులపై అభ్యంతరాలు, లేదా వ్యక్తిగత వివరాలలో సవరణల కోసం భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు సంబంధిత అధికారులకు నిర్ణీత దరఖాస్తు నమూనాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు.ఖచ్చితమైన, సంపూర్ణమైన మరియు నవీకరించబడిన ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి అర్హత గల పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి విజ్ఞప్తి చేస్తున్నారు.

# సొంత బిడ్డల్లా చూసుకోండి: బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత



**అమరావతి మన జనప్రగతి జూలై 31:-** వాతావరణంలో మార్పుల దృష్ట్యా బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని బీసీ సంక్షేమ శాఖాధికారులను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. వేడి చల్లార్చిన తాగునీటిని, తాజా ఆహారాన్ని మాత్రమే అందివ్వాలని ఆదేశించారు. స్వల్ప అస్వస్థత గురై గుంటూరు బీసీ హాస్టళ్లకు చెందిన ముగ్గురు విద్యార్థినులు కోలుకున్నా వారిని వైద్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ఈ మేరకు మంత్రి సవిత గుంటూరు జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారులను, గుంటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ ను ఫోన్ లో దిశానిర్దేశం చేశారు. గుంటూరు నగరానికి చెందిన బీసీ హాస్టల్ విద్యార్థినులు ఐరన్ మాత్రలు వేసుకున్నారు. వారిలో ముగ్గురు విద్యార్థినులకు ఐరన్ ట్యాబెట్లు పడకపోవడంతో వాంతి వచ్చినట్లు, తల తిరిగినట్లు ఉండడంతో స్థానిక జీజీహెచ్ ఆసుపత్రికి బీసీ సంక్క్షేమ శాఖాధికారులు తరలించారు. విషయం తెలుసుకున్నవెంటనే జీజీహెచ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ తోనూ, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి మయూరి, ఇతర అధికారులతోనూ మంత్రి సవిత ఫోన్ లో మాట్లాడి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. విద్యార్థినులు కోలుకున్నారని, ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారని వారు మంత్రికి వివరించారు. ఫుడ్ పాయిజన్ కారణంగా విద్యార్థినులెవరూ అస్వస్థతకు గురికాలేదన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, విద్యార్థినులు పూర్తిగా కోలుకునే వరకూ వైద్యుల పర్యవేక్షణలోనే ఉంచాలన్నారు. హాస్టల్ లో మిగిలిన విద్యార్థినుల గురించి అడిగి తెలుసుకుని, అవసరమైతే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల దృష్ట్యా మరింత అప్రమత్తంగా ఉండాలని బీసీ సంక్షేమశాఖాధికారులకు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. విద్యార్థినులకు వేడి చేసి చల్లార్చిన తాగునీటిని, తాజా ఆహారాన్ని మాత్రమే అందించాలని, హాస్టల్ పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని స్పష్టంచేశారు. హాస్టల్ పరిసరాల్లో నీరు ఎక్కడ నిలబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై అలక్ష్యం చూపితే, సహించేది లేదని, సొంత బిడ్డల్లా చూసుకోవాలని మంత్రి సవిత స్పష్టంచేశారు.

# అక్రమ మద్యం, ఇసుక అక్రమాలపై కఠిన చర్యలు: ముఖేష్ కుమార్ మీనా




**మదనపల్లె మన జనప్రగతి జూలై 31:-** జిల్లాలో అక్రమ మద్యం తయారీ, రవాణా, బహిరంగ మద్యపానాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ (ఎక్సైజ్), పరిశ్రమలు & వాణిజ్యం (గనులు) శాఖల ముఖ్య కార్యదర్శి, టీఈఆర్ సీఈవో ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు.శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో ఎక్సైజ్, గనుల శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణాను అడ్డుకుని నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.మైనింగ్ కార్యకలాపాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, ఇసుక సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధరలను నియంత్రించాలని ఆదేశించారు. అవసరమైతే ఇసుక నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వడ్డెర సహకార సంఘాలకు క్వారీ లీజుల కోసం గుర్తించిన భూములకు అవసరమైన ఎన్‌ఓసీలను త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్ఠాత్మకముగా వడ్డెర సహకార సంఘాలకు కొరకు భవన నిర్మాణ రాయి, రోడ్డు మెటల్, గ్రావెల్, స్లేట్, క్యూబ్స్ మరియు కర్బ్ వంటి ఖనిజాల క్వారీ లీజుల ప్రాధాన్యతలో భాగముగా, మైన్స్ అండ్ జియాలజి వారు వడ్డెర సహకార సంఘాల కొరకు 14 హెక్టార్ల భూమిని గుర్తించడము జరిగినది. భూముల కేటాయింపు ప్రక్రియకు సంబంధించి అవసరమైన ఎన్‌ఓసీల మంజూరును త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, సబ్ కలెక్టర్ కళ్యాణి, కడప జిల్లా డిప్యూటీ కమిషనర్ జయరాజ్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్,గనుల శాఖ ఏడి రంగ కుమార్, ఎక్సైజ్ ఏఈఎస్‌లు జోగేంద్ర, పద్మావతి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు,గనుల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక



# పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహణ

● సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై అవగాహన




**కడప,మన జనప్రగతి జూలై 31:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం కడపలోని న్యాయ సేవా సదన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్–కం–జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని సూచనల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి–కం–సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి పలు న్యాయ అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటీర్ల పాత్ర, విధులు, డ్రెస్ కోడ్, ప్రవర్తనా నియమాలు, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం1987, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, కుటుంబ చట్టాలు, పీఎన్‌డీటీ చట్టం, గృహ హింస నిరోధక చట్టం, జువెనైల్ జస్టిస్ చట్టం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డు విధులు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన చట్టాలు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల సేవలు, నల్సా పథకాలు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థ, మధ్యవర్తిత్వం, శాశ్వత లోక్ అదాలత్, సెప్టెంబర్ 12, 2026న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యతపై వివరించారు.అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ 15100, చైల్డ్‌లైన్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ 14456 సేవలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని పారా లీగల్ వాలంటీర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి చుక్కాని: మంత్రి కందుల దుర్గేష్



**విశాఖపట్నం మన జనప్రగతి జూలై 31 :-** భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కీలకంగా మారుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముందు ఋషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెరుగైన కనెక్టివిటీతో పరిశ్రమలు, పర్యాటక రంగం అభివృద్ధి చెంది ఉత్తరాంధ్రలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.విమానాశ్రయం నిర్మాణానికి భూములు అందించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఋషికొండ బీచ్ పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ కాపాడాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బీచ్ పరిసరాల్లో జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల ప్రయోజనాలను ప్రభుత్వం పరిరక్షిస్తుందని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సాండ్ ఆర్ట్, సాంస్కృతిక ప్రదర్శనలు, సెల్ఫీ పాయింట్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి సిగ్నేచర్ వాల్‌పై తెలుగులో సంతకం చేశారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో పర్యాటకులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఆయుష్ ఆయుర్వేద క్యాంప్




**కాకినాడ మన జనప్రగతి జూలై 31:-** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుషేక రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా స్కిల్ డెవలప్మెంట్ భవనంలో మెగా ఆయుర్వేద క్యాంప్ నిర్వహించారు ఈ క్యాంపులో సుమారు 300 మంది మహిళలు పెద్ద ఎత్తున వచ్చి డాక్టర్ అనిత సూపర్నెంట్, డాక్టర్ మాలతి, డాక్టర్ విజయ కుమారి, డాక్టర్ నీరజ, డాక్టర్ అరుణ, డాక్టర్ పద్మజ, విపివి లక్ష్మి, ఆయుర్వేద ఆసుపత్రి సిబ్బంది మెగా క్యాంపులో రోగులకు వైద్య సేవలు అందించి వారికి తగిన మందులను అందజేశారు, ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రతినెల ఇటువంటి మెగా మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్టు ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకొని వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకొని ఆరోగ్యంగా ఉండేందుకు తగిన సూచనలు సలహాలు తమ వద్ద తీసుకోవాలని తెలియజేశారు.

# ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్షా యోజన'తో అత్యాధునిక వైద్య సేవల విస్తరణ

● దేశంలో ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యం అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

● ఎంపీ తంగెళ్ల ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం



**కాకినాడ,మన జనప్రగతి జూలై 31:-** దేశవ్యాప్తంగా వైద్య, మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాధవ్ తెలిపారు. దేశంలో వైద్య సేవలు విస్తరణ, పిఎంఎస్ఎస్ వై పథకం ద్వారా రాష్ట్రాలకు అందిస్తున్న సేవలు,నిధుల వివరాలపై కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్షా యోజన (గ్రామీణ్) ద్వారా దేశంలో ప్రాంతీయ అసమానతలను తగ్గిస్తూ మెరుగైన వైద్య సేవలను విస్తరించడం, వైద్య విద్యను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని, ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 22 ఎయిమ్స్ సంస్థలు, 75 ప్రభుత్వ వైద్య కళాశాలలు/వైద్య సంస్థల అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టులు ఆమోదం పొందాయని మంత్రి వివరించారు. అలాగే ప్రభుత్వ వైద్య కళాశాలల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లు, అదనపు పడకలు, ఆధునిక డయాగ్నస్టిక్ కేంద్రాలు, క్రిటికల్ కేర్ యూనిట్లు, అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. దీంతో పాటు పీఎంఎస్ఎస్‌వై అమలుకు కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని 202627 ఆర్థిక సంవత్సరానికి 11,307 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

# కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప రూరల్ మన జనప్రగతి జూలై 31:-** జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి శుక్రవారం జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావనలతో కలిసి రాజంపేట నియోజకవర్గం, టి. సుండుపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, వసతి, తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, బోధన, ఆహార నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి అధికారి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. హాస్టల్, పాఠశాల ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థినుల ఆరోగ్యం, భద్రత, విద్యకు సంబంధించిన అన్ని అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, లోపాలు గుర్తించిన వెంటనే వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు.తొలుత జిల్లా కలెక్టర్ జికె రాచపల్లిలోని జడ్పి ఉన్నత పాఠశాలను సందర్శించి స్మార్ట్ కిచెన్ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం టి సుండుపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు.జిల్లా కలెక్టర్ వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్2026 ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- 16.51 లక్షల మంది ఓటర్లతో వైఎస్సార్ కడప జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముసాయిదా: జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి



**కడప మన జనప్రగతి జూలై 31:-** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్2026) కార్యక్రమంలో భాగంగా 2026 జూలై 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ వైఎస్సార్ కడప జిల్లాకు సంబంధించిన ముసాయిదా ఫోటో ఓటరు జాబితాను శుక్రవారం విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, అన్ని ఎన్నికల నమోదు అధికారుల కార్యాలయాలు, సహాయ ఎన్నికల నమోదు అధికారుల కార్యాలయాలు, అలాగే నియోజకవర్గాల పరిధిలోని గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితాను అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 16,51,312 మంది సాధారణ ఓటర్లు ముసాయిదా జాబితాలో నమోదయ్యారని తెలిపారు. వీరిలో పురుషులు 8,09,839 మంది, మహిళలు 8,41,337 మంది, తృతీయ జెండర్ కు చెందిన ఓటర్లు 136 మంది ఉన్నట్లు వెల్లడించారు. అదనంగా సర్వీస్ ఓటర్లు 2,217 మంది ఉన్నారని, వీరిలో పురుషులు 2,158 మంది, మహిళలు 59 మంది ఉన్నట్లు వివరించారు.నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే జమ్మలమడుగు నియోజకవర్గంలో అత్యధికంగా 2,22,619 మంది ఓటర్లు ఉండగా, కమలాపురం నియోజకవర్గంలో అత్యల్పంగా 1,84,559 మంది ఓటర్లు నమోదైనట్లు కలెక్టర్ తెలిపారు.**నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య..** బద్వేల్ 2,00,193రాజంపేట 2,15,825కడప 2,17,415పులివెందుల 2,00,531కమలాపురం 1,84,559జమ్మలమడుగు 2,22,619ప్రొద్దుటూరు 2,18,603మైదుకూరు 1,91,567ఓటర్లందరూ ముసాయిదా జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఏవైనా తప్పులు, అభ్యంతరాలు లేదా మార్పులు అవసరమైతే ఎన్నికల శాఖ నిర్దేశించిన గడువులోగా సంబంధిత ఎన్నికల నమోదు అధికారులకు దరఖాస్తులు సమర్పించి సరిచేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుది ఓటరు జాబితా రూపొందించే ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు

# "వన్ డే వన్ వార్డ్" కార్యక్రమం విజయవంతం

**ప్రజా సమస్యలపై అధికారులతో సమీక్ష సమావేశం**

**సమావేశంలో పాల్గొన్న ప్రముఖ నాయకులు**



**శేరిలింగంపల్లి మన జనప్రగతి జూలై 31: -** కొండాపూర్ డివిజన్ పరిధిలోని మస్తాన్ నగర్ కాలనీలో నిర్వహించిన "వన్ డే వన్ వార్డ్" కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో భాగంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశానికి పిఎసి చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ , కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ , గౌరవ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఐఏఎస్ అధికారి జి. సృజన , జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ , డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ గారు, సీఎంసీ పరిధిలోని పలు విభాగాల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.సమావేశంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి కాలనీలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమం సీనియర్ నాయకులు ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్, మల్లెల శ్రావణ్ యాదవ్, మల్లెల రాజు , మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# సింగిల్ విండో చైర్మన్ తల్లి మృతికి ఉమాదేవి నివాళి




**తొండూరు, మన జనప్రగతి జూలై 31:-:** మండలంలోని మల్లెల గ్రామానికి చెందిన సింగిల్ విండో సహకార సంఘం చైర్మన్ పందిర్లపల్లి సూర్యనారాయణ రెడ్డి తల్లి నారాయణమ్మ (75) గురువారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు.ఆమె మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి శుక్రవారం మల్లెల గ్రామానికి చేరుకుని నారాయణమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సూర్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి, ధైర్యంగా ఉండాలని ఓదార్పునిచ్చారు.

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం, రెండు కళ్ళు



**తిరుపతి మన జనప్రగతి జులై 31 :-** తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు ఇలాంటివన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, 34వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ మునిశేఖర్ రాయల్ తెలిపారు. శుక్రవారం 34 డివిజన్ పరిధిలోని 114వ బూత్ లో రెండేళ్ల పాలనపై తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ రెండేళ్ల కాలంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సుబ్బరామయ్యతో పాటు మునిశేఖర్ రాయల్ ఇంటింటికి వెళ్లి వివరించారు. 34 డివిజన్ పరిధిలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఏ సమస్య వచ్చినా తాము ముందుండి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ సురేష్ కుమార్, బూత్ కన్వీనర్ యశ్వంత్,ముని సుబ్రహ్మణ్యం, గంగయ్య, నైనార్ శ్రీనివాస్, వేణుగోపాల్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితా విడుదల



**తిరుపతి మన జనప్రగతి జూలై 31 :-** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)–2026లో భాగంగా తిరుపతి జిల్లా ముసాయిదా ఓటరు జాబితాను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. ఎస్. వెంకటేశ్వర్ శుక్రవారం విడుదల చేశారు.జిల్లాలో మొత్తం 14,81,603 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. వీరిలో పురుషులు 7,20,329 మంది, మహిళలు 7,61,188 మంది, థర్డ్ జెండర్లు 86 మంది ఉన్నారు.జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, సవరణలు, కొత్త ఓటర్ల నమోదు కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. జూలై 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులు ఫారం–6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని, పేరు, చిరునామా తదితర సవరణలకు ఫారం–8 వినియోగించాలని సూచించారు. రాజకీయ పార్టీలు, ప్రజల సహకారంతో పారదర్శకంగా, లోపరహిత ఓటరు జాబితా రూపొందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 2,221 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ముసాయిదా ఓటరు జాబితా సంబంధిత ఎన్నికల అధికారుల కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
01- 08 - 2026

# స్మార్ట్ సిటీలో మరో ముందడుగు

- ఒంటిమామిడి కూడలి వద్ద కాలువ పనులకు శ్రీకారం
- రూ.12 లక్షలతో 300 మీటర్ల మేర మురుగు కాలువ పునరుద్ధరణ



**కాకినాడ మన జనప్రగతి జూలై 31:-** కాకినాడ స్మార్ట్ సిటీ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గాంధీనగర్ ఒంటిమామిడి కూడలి నుంచి గాంధీనగర్ రైతు బజార్ వరకు మురుగు కాలువ పునరుద్ధరణ పనులను శుక్రవారం ప్రారంభించారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య, 41వ వార్డు కూటమి ఇన్‌చార్జ్ జొన్నాడ వెంకటరమణ, మైలపల్లి విద్యాసాగర్, డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కవికొండల భీమశేఖర్, వాసిరెడ్డి సత్యకుమార్, గోడి సత్యవతి తదితరులు కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్షాకాలంలో గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో మురుగునీటి పారుదల సమస్య తీవ్రంగా ఉండటంతో కాలువ పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చొరవతో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ రూ.12 లక్షల వ్యయంతో సుమారు 300 మీటర్ల మేర కాలువను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. కృష్ణజీవ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ నల్ల శశి అనిల్ కుమార్‌తో పాటు కే. రామ్, కెవిఎల్ నరసింహారావు, పి,దురాప్రసాద్, చిందాన సూరిబాబు, జి. అంజిబాబు, పల్ల శ్రీనివాస్, వాసంశెట్టి శ్రీనివాస్, మోటూరి మధుసూదన్ రావు,కే. వెంకటేశ్వరరావు,పి.వరప్రసాద్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మొక్కాళ్లపై అలిపిరి మెట్లు.. షర్మిల ఆరోగ్యం కోసం బాలిరెడ్డి ప్రత్యేక మొక్కు



**కలికిరి మన జనప్రగతి జూలై 31:-** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం కోలుకుంటున్న నేపథ్యంలో, ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో మరింత చురుకుగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి అలిపిరి మెట్ల మార్గంలో మొక్కాళ్లపై నడుస్తూ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వై.ఎస్. షర్మిల సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని, రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని శ్రీవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. అనంతరం శ్రీవారికి టెంకాయలు కొట్టి తన మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న వై.ఎస్. షర్మిల త్వరగా కోలుకుని మునుపటిలాగే ప్రజల మధ్యకు వచ్చి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆమెకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరి మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలకడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ భాష, రాష్ట్ర లీగల్ సెల్ సభ్యుడు రవి, కాంగ్రెస్ నాయకులు మంగునాయక్, శ్రీనివాస్, అనిల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, షర్మిల అభిమానులు పాల్గొన్నారు. వారంతా కలిసి వై.ఎస్. షర్మిల త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజా జీవితంలో చురుకుగా కొనసాగాలని శ్రీవారిని ప్రార్థించారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 31:-** శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి వర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరులు మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి & సౌమ్య రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్ ఆర్థిక సహాయంతో మదనపల్లి రోడ్డు మరియు చిత్తూరు రోడ్డు మార్గాన గుడిసెలలో నివసించే పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అధ్యక్షులు లయన్ యస్.అంజి రెడ్డి తెలిపారు. అనంతరం దాత డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్ మాట్లాడుతూ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి&సౌమ్య రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ప్రజలకు చేస్తున్న సేవలను చూసి నా వంతుగా గుడిసెలలో నివసించే పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి.ఎస్. హరినాథ్ రెడ్డి,జోన్ చైర్మన్ లయన్ పి.శివారెడ్డి,మాజీ అధ్యక్షులు లయన్ పసుపులేటి శ్యామ్, కె.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

# హోమియో వైద్యంతో ఆరోగ్యకర జీవనం




**కాకినాడ రూరల్, మన జనప్రగతి జూలై 31:-** స్థానిక శశికాంత్ నగర్లో ఉన్న విద్యాంజలి పాఠశాలలో ఇన్‌స్పిరేషన్ వీక్2026 కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూర్యచంద్ర హోమియో హాస్పిటల్ వైద్యులు సలాది సూర్యకిరణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆరోగ్య సంరక్షణలో విజ్ఞానయాత్ర అనే అంశంపై విద్యార్థులకు హోమియోపతిపై అవగాహన కల్పించారు. హోమియోపతి వైద్య విధానం, ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యాధుల నివారణ, సహజ చికిత్సల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం సెక్రటరీ వి.సంధ్య, అకాడమిక్ డైరెక్టర్ ఎం. జయబాబు, ప్రిన్సిపాల్ పి. ఫణీశ్వరి చేతుల మీదుగా డా. సలాది సూర్యకిరణ్ ను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

# జ్యోతి గ్రామంలో అపరిశుభ్రత

- భక్తులు, గ్రామస్తుల ఆందోళన
- త్రాగునీటి ట్యాంక్ వద్ద మురుగునీరు
- చెత్త తొలగింపు, బ్లీచింగ్ చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి హామీ





**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 31:-** శ్రీశైల క్షేత్రానికి దక్షిణ ముఖ ద్వారమైన సిద్ధవటం మండలం జ్యోతి గ్రామంలో అపరిశుభ్రత తీవ్రంగా పెరిగి భక్తులు, గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్రాగునీటి ట్యాంకు సమీపంలో మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపిస్తోందని, త్రాగునీటిలో మలినాలు చేరుతున్నాయని స్థానికులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని పలు రహదారులపై చెత్త పేరుకుపోవడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, శివయ్య దర్శనానికి వచ్చే భక్తులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. చెత్త సేకరించే గ్రీన్ అంబాసిడర్ వాహనం పనిచేయకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా దెబ్బతిందని ఆరోపించారు. ఈ విషయమై జ్యోతి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓబులేసును వివరణ కోరగా, త్రాగునీటి ట్యాంకు పరిసరాల్లోని అపరిశుభ్రతను వెంటనే తొలగించి, గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపడతామని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్ వాహనం మరమ్మతులో ఉందని, హరిత రాయబారుల ద్వారా చెత్త తొలగించి బ్లీచింగ్ పిచికారీ నిర్వహించి గ్రామస్తులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కడపలో ఘనంగా ఇన్వెస్టిచర్ సెరిమనీ

- నేటి పిల్లలే రేపటి దేశాన్ని నడిపించే బాధ్యతాయిత నాయకులు
- వై వి యు వైస్ ఛాన్సలర్ రాజశేఖర్ బెల్లంకొండ




**కడప మన జనప్రగతి జూలై 31:-** ఎంపవరింగ్ లీడర్స్, ఇన్‌స్పైరింగ్ టుమారో అన్న నినాదంతో ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కడప ఆవరణలో శుక్రవారం ఇన్వెస్టిచర్ సెరిమనీ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండ ముఖ్య అతిధులుగా విచ్చేశారు. పాఠశాల జెండా ఆవిష్కరణతో కార్యక్రమం మొదలైంది. ప్రిఫెక్టులకు ఇన్వెస్టిచర్ నిర్వహించారు. గత విద్యా సంవత్సరం పదవ తరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు కాడసాని జ్ఞాన ఆశ్రిత్ రెడ్డి, గడికోట జోషిత రెడ్డి లకు బంగారు పథకాలు, బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండ మాట్లాడుతూ నాయకత్వం అనేది సమాజానికి ఎంతో అవసరమని, నేటి ఈ పిల్లలే రేపటి దేశాన్ని నడిపించే బాధ్యతాయుత నాయకులుగా తయారవుతారని అన్నారు. నాయకులకు విజన్ అనేది చాలా ముఖ్యమని, అది చిన్నతనం నుంచే వారికి నేర్పించడం నిజంగా హెచ్‌పిఎస్ చేస్తున్న గొప్ప కృషి అని ఆయన కొనియాడారు. అనంతరం ప్రిన్సిపల్. అమిత్ సింగ్ మాట్లాడుతూ పాఠశాల వార్షిక అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధానాచార్యులు శ్రీనివాస మూర్తి, కోఆర్డినేటర్లు, ఇన్‌ఛార్జీలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. మెమెంటో ప్రదానం, వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# మాటల కంటే చేతులతో చేసి చూపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- గాజుల ఖాదర భాష తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 31:-** ప్రతి కార్యకర్తను గౌరవిస్తూ యువతకు అవకాశాలు కల్పిస్తూ ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న దురదృష్టి గల నాయకులు చంద్రబాబు నాయుడు లోకేష్ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు శుక్రవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఐటి విద్యాశాఖ మాత్యులు గౌరవనీయులై నలోకేష్ ఆదేశాలతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి తమ్ముడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి సూచనలతో బూత్ ఇంచార్జ ఎద్దుల లక్ష్మీ ప్రసాద్ తో కలిసి 115 వబూతు నందు ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజుల ఖాదర్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమాలను ప్రజలకు వివరిస్తున్న సమయంలో ప్రజలు ప్రతి ఒక్కరు ఇది మంచి ప్రభుత్వం అని పేద ప్రజల గురించి ఆలోచిస్తున్న ప్రభుత్వమని గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు ఎస్సీలకు ఎస్టీలకు మైనార్టీలకు పూర్తిగా తొక్కి వేయడం జరిగిందని ప్రతి ఒక్కరి నోటి నుండి వినిపిస్తున్న మాట ఇదే అన్నారు ఇచ్చిన మాట తప్పకుండా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని చెప్పారు ఏ సమస్య వచ్చినా మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్కి తెలియజేయాలని ఆ సమస్యను తన సమస్యగా భావించి వెంటనే పరిష్కరిస్తారని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సూరి అమీర్ భాష రోఫా రాజు రామయ్య ఫయాజ్ పెంచలయ్య హైదర్ రఫీ తదితరులు పాల్గొన్నారు


# దగ్గు, ఆయాసం ఉంటే వెంటనే కఫ పరీక్షలు చేయించుకోండి: డాక్టర్ రంగలక్ష్మి




**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 31:-** రెండు వారాలకు పైగా దగ్గు, ఆయాసం, అలసటతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా సమీప ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కఫ (స్పుటం) పరీక్షలు చేయించుకోవాలని పి. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. అలాగే గృహాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలలను సంప్రదించి చికిత్స పొందాలని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

# అమరలింగేశ్వర స్వామి సన్నిధిలో నవగ్రహ ప్రతిష్ఠ 41వ రోజు విశేష పూజలు

- పంచామృత అభిషేకాలు, హోమాలు ఘనంగా నిర్వహణ



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 31:-** సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామంలోని శ్రీ మంగళగౌరి సమేత శ్రీ అమరలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రతిష్ఠించిన నవగ్రహాల ప్రతిష్ఠకు 41 రోజులు పూర్తైన సందర్భంగా శుక్రవారం విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహాలకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు వైభవంగా నిర్వహించగా, గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లతో పాటు నవగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆలయ ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా సాగాయి.

# కడప మార్కెట్ యార్డును అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే మాధవి



**కడప మన జనప్రగతి జూలై 31:-** కడప మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన కడప వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యురాలు మాధవి మరియు టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్‌లో ఎదురవుతున్న పలు సమస్యలతో పాటు, పారిశుధ్యం మెరుగుపరచడం మరియు మార్కెట్ యార్డ్ నిర్వహణ అంశాలపై ప్రధానంగా చర్చించారు. రైతులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యార్డ్‌లో సౌకర్యాలను మరింత పెంచాలని, పారిశుధ్య లోపాలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు మరియు కమిటీకి మాధవి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉస్మాన్ వైస్ చైర్మన్ పాలంపల్లి సుబ్బారెడ్డి .కమిటీ సభ్యులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి: దీపక్ జేమ్స్

**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 31:-** రాయచోటి సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రిజిస్ట్రేషన్ డ్రైవ్‌లో కడప, అన్నమయ్య జిల్లాల యూత్ ఆఫీసర్ దీపక్ జేమ్స్ పాల్గొన్నారు. యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. యూత్ పార్లమెంట్, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, వివిధ పోటీలు, నాయకత్వ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. జాతీయ స్థాయిలో మై భారత్ పోటీల్లో ఐదో స్థానం, రాష్ట్రంలో తొలి స్థానం సాధించిన వీరబల్లి ఎస్డీకేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి వెంకట లోకేష్‌ను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం మై భారత్ పోర్టల్‌లో నమోదు విధానాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్-ఎస్ ప్రతినిధులు, మై భారత్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రాంగణ ఎంపికలలో సత్తా చాటిన శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 31:-** రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులు శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి సాఫ్ట్వేర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు . ఈ సందర్భంగా శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఎడు ఎక్స్పేన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ సంస్థ నిర్వహించిన వివిధ దశల ఎంపికలో ప్రతిభ కనబరిచి27 మంది విద్యార్థిని విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన వారికి 5 లక్షల వార్షిక వేతనం అందుతుందని తెలియజేశారు. కళాశాలలో ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని పోటీ పరీక్షల ప్రతిభ కనపరచడానికి అవసరమగు అర్థమెటిక్, కమ్యూనికేషన్ స్కిల్స్ ,రీజనింగ్ వంటి అంశాలపై ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. వెంకటరమణ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ కొత్తపల్లి ఇంతియాజ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి డాక్టర్ ఏ నరేష్ కుమార్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా స్ట్రక్చర్స్ విభాగాధిపతి జూ. సుబహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఏ. కరుణాకర్, సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. నాగేంద్ర మెకానికల్ విభాగాధిపతి పి. శ్రావణ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సౌజన్య అధ్యాపకులు, మరియు విద్యార్థిని విద్యార్థులు అభినందించారు

# టిడిపితోనే గడపగడపకు అభివృద్ధి సంక్షేమం: బూత్ కన్వీనర్ విజయ భాస్కర్ రెడ్డి



**రామాపురం మన జనప్రగతి జులై 31:-** మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు డోర్ టు డోర్ కార్యక్రమం సరస్వతి పల్లి లో విజయవంతంగా నిర్వహించారు రామాపురం మండలం సరస్వతి పల్లి గ్రామం 53వ బూతు కన్వీనర్ గడికోట విజయభాస్కర్ రెడ్డి మరియు అయోధ్య పురం సుకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతం జరిగిందిరాయచోటి నియోజకవర్గం లోని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నాయకత్వంలో లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మౌర్య రెడ్డి సూచనల మేరకు తెలుగుదేశం పార్టీ చేపట్టిన రామాపురం మండలం సరస్వతి పల్లి గ్రామం హరిజనవాడలో బూత్ నెంబర్ 53లో డోర్ టు డోర్ కార్యక్రమంలో జరిగింది డోర్ టు డో చేరుకొని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమాలు కార్యక్రమాలు ప్రజల వద్దకి తీసుకువెళ్దాం ప్రజల నుంచి వస్తున్న అపూర్ణ ఆదరణ విశ్వాసమే మా బలం మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పథకంలో నడిపించేందుకు ప్రజల ఆశీర్వాదంతో ముందుకు సాగుతున్నాం ఈ కార్యక్రమంలో సరస్వతి పల్లి గ్రామ గ్రామ నాయకులు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో కడప శివయ్య వెంకటసుబ్బయ్య రాజారెడ్డి రామాపురం ఐటీడీపీ కిషోర్ సోమనాదం ఆది సాంబ సుబ్బరాయుడు పిచ్చయ్య రాజా కృష్ణయ్య లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

# కొత్త మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ఏపీ ఎన్జీవోస్ సంఘం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 31:**ప్రొద్దుటూరు తాలూకా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు, జేఏసీ ఛైర్మన్ జె. రామసుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ విశ్వనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఏపీ ఎన్జీవోస్ సంఘంపై తనకు ప్రత్యేక అభిమానం ఉందని, తాను కూడా సంఘం నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తినని, ఏపీ ఎన్జీవోస్ సంఘంలో సభ్యుడిగా ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం సంఘం అధ్యక్షుడు జె. రామసుబ్బయ్య యాదవ్ మాట్లాడుతూ మున్సిపల్ పరిపాలనలో కమిషనర్‌కు సంఘం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం సంఘం తాలూకా అధ్యక్షుడు, కార్యదర్శి ఆధ్వర్యంలో కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు. తాలూకా కార్యదర్శి ఇ. ప్రమీల, ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ అరుణాదేవి, వైస్ ప్రెసిడెంట్ నాగార్జున, వరప్రసాద్, ఆర్గనైజేషన్ సెక్రటరీ ప్రభంజన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ సుజాత, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పేరయ్య, కార్యదర్శి ఓంకార్, ఉమెన్ వింగ్ సభ్యురాలు రాజ్యలక్ష్మి, మహేశ్వరయ్య, సుధాకర్‌తో పాటు పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మృతుడికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించిన మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 31:-** ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో మరణించిన గుర్తు తెలియని వ్యక్తికి బంధువులు ఎవరూ లేకపోవడంతో మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చి హిందూ సంప్రదాయం ప్రకారం గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సమాచారం మేరకు ఫౌండేషన్ టౌన్ అధ్యక్షుడు సుబహాన్ వెంటనే స్పందించి, హిందూ స్మశానవాటికలో అంతిమ సంస్కారాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ అధ్యక్షుడు సుబహాన్, అశోక్ కుమార్, సతీష్, రసూల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ, సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలనే లక్ష్యంతో ఫౌండేషన్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తూ ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. అలాగే, ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్ధులకు సహాయం చేయాలనుకునే దాతలు 82972 53484 లేదా 91822 44150 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రతి ఇంటికీ కూటమి సుపరిపాలన

**• 27వ వార్డులో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 31:-** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న "కూటమి పాలన 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 27వ వార్డులో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే సామాజిక పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు కు పెంచి ఎన్నికల హామీని నిలబెట్టుకున్నామని పేర్కొన్నారు. అలాగే 'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం, ప్రతి మహిళకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, మహిళల ఉపాధి కోసం కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలు, స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు టీడీపీ పరిశీలకులు కొండవీటి భావన, టీడీపీ కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వై.ఎస్. జబివుల్లా, అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు, హెచ్‌డీసీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు ఈవి సుధాకర్ రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంకదార నరేంద్రరావు, జనసేన నాయకులు సుంకర మురళి, పగిడాల దస్తగిరి, రిటైర్డ్ ఎస్ఐ శంకర్‌తో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటమి భయంతో వైఎస్సార్సీపీ నేతల నిరాధారణ ఆరోపణల ప్రచారం

**• ప్రజలు నమ్మేది అభివృద్ధినే, అబద్ధాలను కాదు**

**• నామా వేమ కుమార్,వేంపల్లి పట్టణ అధ్యక్షుడు**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 31:-** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల తీర్పు తమకు వ్యతిరేకంగా ఉంటుందని ముందే గ్రహించిన వైఎస్సార్సీపీ నాయకులు అవాస్తవ ఆరోపణల ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ వేంపల్లి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్ విమర్శించారు. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల సృష్టి ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. అందుకే "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. వార్డుల పర్యటనలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన విషయాన్ని , పరిశ్రమలు వెనక్కి వెళ్లిన పరిస్థితిని, ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను మర్చిపోయి ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు భావోద్వేగాలు కాదు, పనితీరును చూస్తారని, గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలే కూటమి ప్రభుత్వానికి బలం అని అన్నారు.

# ప్రజల ఆశయాలకు అండగా "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం

**• టీడీపీ మండల పరిశీలకులు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 31:-** మండలంలోని టి. వెలమవారిపల్లె గ్రామంలో నిర్వహించిన "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో వెంపల్లె టీడీపీ మండల పరిశీలకులు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని వారు సందర్శిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ నిర్ణయాల వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వారు తెలియజేశారు. అలాగే గ్రామస్థుల సమస్యలు, అవసరాలు, స్థానిక ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారానే సమర్థమైన ప్రజాపాలన సాధ్యమవుతుందని అజ్జుగుట్టు రఘునాథరెడ్డి అన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, గ్రామ పెద్దలు, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు మాకు కావాలి ఇది మా హక్కు: బీసీ సంఘం స్పష్టం



**కడప మన జనప్రగతి జూలై 31 :-** కడప పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద బిసి సంక్షేమ సంఘం బి సి రాష్ట్ర నాయకుడు దుడం .రెడ్డి బాబుఆధ్వర్యం లో నిరసన కార్యక్రమం జరిగింది. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి, ఎస్సీ , ఎస్టీ , ఈడబ్ల్యూ ఏస్ రిజర్వేషన్లను తీసివేయడానికి ఎవరు మీరు? అంటూ ప్రశ్న."మా రిజర్వేషన్లు మాకు కావాలి.. ఇది మా హక్కు" అంటూ బీసీ సంఘం స్పష్టం. భారతదేశంలో అమలవుతున్న రిజర్వేషన్లను ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదని వ్యాఖ్య. రిజర్వేషన్లు తీయాలంటే ప్రతి వర్గంలో సమానత్వం రావాలని డిమాండ్. దేశవ్యాప్తంగా రిజర్వేషన్లపై మరెవరి చర్చను సహించబోమని హెచ్చరిక. "రిజర్వేషన్ హటావు " నినాదాలతో ప్రజలను రెచ్చగొట్టొద్దని సూచన. భారత్‌లో రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధ హక్కులని బీసీ సంఘం స్పష్టం. రిజర్వేషన్లపై రాజకీయం చేస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని హెచ్చరిక. "మా నినాదం మా జనాభా, మా వాటా, మా హక్కు" అంటూ బీసీ సంఘం నినాదం. రిజర్వేషన్లను రద్దు చేసే ఆలోచనలను దేశ ప్రజలు అంగీకరించరని వ్యాఖ్య. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు ఉద్యమం కొనసాగుతుందని బీసీ సంఘం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గం సభ్యులు కత్తి నాగిరెడ్డి, మైదుకూరు మండల అధ్యక్షులు లక్ష్మయ్య, వెంకటస్వామి, బాలయ్య. చిన్నోడు, పద్మావతి బాయ్ తదితరులు పాల్గొన్నారు

# ముర్రుపాల ప్రాముఖ్యతను ప్రతి తల్లికి వివరించాలి: డా. శ్రీగిరీష



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూలై 31:-** ప్రసవించిన అరగంటలోపు శిశువుకు ముర్రుపాలు పట్టించడం అత్యంత ముఖ్యమని పీలేరు మండలం తలుపుల పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డా. శ్రీగిరీష అన్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అవే పూర్తి పౌష్టికాహారమని తెలిపారు. తల్లిపాలు శిశువు ఆరోగ్యం, ఎదుగుదల, రోగనిరోధక శక్తి పెంపుతో పాటు మానసిక వికాసానికి కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి తల్లికి ముర్రుపాల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

# సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన



**బొమ్మనహాళ్ మన జనప్రగతి జూలై 31:-**మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బందూరు గ్రామ ఆర్‌డీటీ కాలనీలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు,మలేరియా, డెంగ్యూ,చికున్‌గున్యా, మెదడువాపు జ్వరాలతో పాటు కరోనా నివారణకు మాస్క్ ధరించడం,తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం,వారానికి ఒకసారి డ్రైడేఫ్రైడే పాటించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి,దోమతెరలు, వినియోగించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్,కాలనీ వాసులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

**పులివెందుల రూరల్ మన జనప్రగతి జూలై 31:-** లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమ 17వ వార్షికోత్సవము సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగినది దీని విజయవంతం చేయాలని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మూలి కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. శనివారం ఉదయం 8 నుండి సాయంత్రం 3 వరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సౌజన్యముతో రక్తదాన శిబిరము నిర్వహింపబడుననీ, రక్తదాతలకు ప్రశంసాపత్రము ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం అల్పాహారము, మధ్యాహ్నం భోజనము ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

# పంట బీమా నమోదు గడువు పొడిగింపు

**- ఆగస్టు 15 వరకు రైతులు నమోదు అవకాశం**

**-మండల వ్యవసాయ అధికారి సాయికుమార్**



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 31:** -ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్ బివై) కింద కొన్ని ఖరీఫ్ పంటల మాత్రమే బీమా నమోదు గడువును ఆగస్టు 15 తేదీ వరకు పొడిగించినట్లు బొమ్మనహాల్ మండల వ్యవసాయ అధికారి సాయికుమార్ తెలిపారు,గడవు పొడిగించిన కొన్ని పంటలు వివరాలు పంటల వారీగా రైతులు చెల్లించాల్సిన ప్రీమియం ఎకరానికి కంది..రూ.80,వరి.. రూ.410,జొన్న.. రూ.210, మొక్కజొన్న..రూ.330, ఆముదం..రూ.200, మిరప.. రూ.1,440గా,నిర్ణయించబడిందన్నారు,ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు,భారీ వర్షాలు, అనావృష్టి,తుఫాన్లు,వడగళ్ల వానలు,అలాగే కీటకాలు,తెగుళ్ల వల్ల పంట నష్టం సంభవించినప్పుడు రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పంట బీమా ఉపయోగపడుతుందని తెలిపారు,ఇంకా నమోదు చేసుకోని రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రం లేదా సీఎస్సీ కేంద్రాలను సంప్రదించి ఆగస్టు 15లోపు పంట బీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సాయికుమార్ తెలియజేశారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
01- 08 - 2026

# రైల్వేకోడూరులో అఖిలపక్ష సమావేశం

● ఓటర్ల సౌకర్యానికి అనుగుణంగా

## బూత్‌ల ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ విజ్ఞప్తి




**రైల్వేకోడూరు, మన జనప్రగతి జూలై 31:-** రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో) శోభన్‌బాబు అధ్యక్షత వహించారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సి.హెచ్. రమేశ్ హాజరై ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ బూత్‌ల మార్పులపై పలు సూచనలు చేశారు.సమావేశంలో మాట్లాడుతూ, ఈ నెల 31తో ప్రత్యేక సర్వే పూర్తవుతున్న నేపథ్యంలో వచ్చే నెల నుంచి ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియ ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని ఓటర్లు తమ నివాస గ్రామంలోనే ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఒక గ్రామానికి చెందిన ఓటర్లను ఇతర ప్రాంతాల బూత్‌లకు కేటాయించడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ముఖ్యంగా 15వ నంబర్ బూత్‌కు సంబంధించిన సమస్యను ప్రస్తావిస్తూ, ధర్మపురం ప్రాంతానికి చెందిన బూత్‌ను ఎంఆర్వో కార్యాలయం వెనుక భాగానికి మార్చిన కారణంగా ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని, రైల్వేకోడూరు పట్టణానికి సమీపంలోని పాఠశాల వద్దనే ఆ బూత్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే నియోజకవర్గంలో నమోదైన 26,046 మంది గైర్హాజరు, షిఫ్ట్ అయిన, మరణించిన ఓటర్ల (ఆసాణ) వివరాలను బూత్‌వారీగా అందించాలని, వాటిని పారదర్శకంగా పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టాలని ఎన్నికల అధికారులను కోరారు. సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పాల్గొని ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

# కడపను అభివృద్ధి పథంలో నడిపిస్తాం



**కడప మన జనప్రగతి జూలై 31:-** కడప 14 డివిజన్‌లో ముమ్మరంగా 'ఇంటింటికీ తెలుగుదేశం' పాల్గొన్న ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి కడప నగరంలోని 14 వ డివిజన్ పప్రకాష్ నగర్ వద్ద 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యురాలు శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి మరియు టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సుపరిపాలనలో, గత రెండేళ్లలో సాధించిన అపూర్వమైన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలు మరియు పారదర్శక పాలనా విజయాలను వారు డోర్-టు-డోర్ తిరుగుతూ ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, నగర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందనే భరోసాను కల్పించారు. స్థానిక ప్రజల నుండి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ బందెల దివాకర్. ఇలియాస్ .ఉదయ్ .మనోజ్ కుమార్ రెడ్డి .సుబ్బారెడ్డి. ప్రసాదు. బాలకృష్ణారెడ్డి .టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# హంద్రీ నది పరివాహక ప్రాంతంలో ఆక్రమణలను పూర్తిగా తొలగించాలి: జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 31:-** హంద్రీ నది పరివాహక ప్రాంతంలో ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నీటి వనరులు మరియు చెరువు ల ఆక్రమణ లకు సంబంధించి జిల్లా స్థాయి వాచ్ డాగ్ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ హంద్రీ నది పరివాహక ప్రాంతంలో ఆక్రమణల నివారణ, భవిష్యత్తులో అక్రమ నిర్మాణాల నియంత్రణపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. హంద్రీ నది పరివాహక ప్రాంతంలో గుర్తించిన ఆక్రమణలన్నింటినీ ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తిగా తొలగించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నీటిపారుదల శాఖ అధికారులు సరిహద్దులను గుర్తించి పోల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో చిన్నపాటి ఆక్రమణ కూడా జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీల పరిధిలో హంద్రీ నది ప్రాంతంలో ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించి, ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే హంద్రీ నది పరివాహక ప్రాంతంలో ఎలాంటి కొత్త నిర్మాణాలు చేపట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే అడ్డుకోవాలని మున్సిపల్ అధికారులు, రెవెన్యూ మరియు నీటిపారుదల శాఖల సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**పత్తికొండ మన జనప్రగతి జులై 31:-** ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో "డిమాండ్స్ డే" కోరికల దినోత్సవంపేరుతో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితర అధికారులకు వినతిపత్రాలు సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగా జర్నలిస్టుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాలు, పెన్షన్, ఆరోగ్య బీమా, మీడియా కమిషన్ ఏర్పాటు వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు కర్నూలు జిల్లా నాయకులు అటికెలగుండు నాగలింగన్న నియోజకవర్గం చిన్నారెడ్డి, ఎం రమేష్ లు విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాలు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి. అలాగే పక్క గృహాలు నిర్మించాలి. మీడియా కమిషన్ రాష్ట్రంలో తక్షణమే మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.



మీడియా కమిషన్ ఏర్పాటు చేయడం వల్ల మీడియా రంగంలో పనిచేసే వారికి సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. మీడియా కమిషన్ వల్ల వర్కింగ్ జర్నలిస్టులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రవాణా సౌకర్యాలు: జర్నలిస్టులకు ఏసీ బస్ పాసులు మంజూరు చేయాలి. ఉచిత బస్సు సౌకర్యం వల్ల వివిధ ప్రాంతాలకు వెళ్లి వార్తలు సేకరణలో జర్నలిస్టులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కావున అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఉచిత బస్సులు కల్పించాలన్నారు. రక్షణ చట్టం జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం తేవాలన్నారు. సమాజంలో నిత్యం ఉన్నది ఉన్నట్లు రాసే జర్నలిస్టులపై దాడులు ఎక్కువయ్యాయని వాటిని అరికట్టాలంటే ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. రాజకీయ నాయకుల పైన అవినీతి అధికారుల పైన వార్తలు రాసే విలేకరులకు రక్షణ చట్టం ఏర్పాటు అయినట్లయితే భవిష్యత్తులో జర్నలిస్టులపై ఎలాంటి దాడులు జరగమని వారు పేర్కొన్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం ఈ డిమాండ్లను పరిష్కరించాలని న్యాయమైన కోరికలను నెరవేర్చాలని ప్రతి ఏట నిర్వహించే కార్యక్రమంలో భాగంగా పత్తికొండ ఆర్డిఓ బి.చిన్న. ఓబులేసుకు వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు.

# మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: తహశీల్దార్ రఘు

● నేమకల్లులో మానవ హక్కులు,చట్టాలపై సివిల్ రైట్స్ డే

**బొమ్మనహాళ్ మన జనప్రగతి జూలై 31:-**మండల పరిధిలో నేమకల్లు గ్రామంలో మండల తహశీల్దార్ రఘు ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే..మానవ హక్కులు,చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ రఘు మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించలన్నారు,అదేవిదంగా భూములకు సంబంధించిన వివాదాలు ఏదైనా ఉంటే గొడవలకు దారి తీయకుండా సంబంధిత తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి భూ రికార్డులు ప్రకారం చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు,ప్రతి ఒక్కరూ మానవ హక్కులను గౌరవిస్తూ చట్టాలను పాటించాలని కోరారు,అనంతరం ఏఎస్ఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ..ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న




నేపథ్యంలో అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు,ఓటీపీలు,బ్యాంకు వివరాలు ఎవరికీ ఇవ్వొద్దని సూచించారు.అలాగే పోక్సో చట్టంపై అవగాహన కలిగి చిన్నారుల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తెలిపారు,ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని వివరించారు, తహశీల్దార్ రఘు,ఏఎస్ఐ విజయ్ కుమార్, ఆర్ఐ,బాలకృష్ణ,హెడ్ కానిస్టేబుల్ నరేంద్ర,వీఆర్వో నరసింహులు,గ్రామ పెద్దలు హనుమంతరాయ,బసప్పతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విబిజి-రామ్ జి,పనుల వైపు తిరిగి చూడని అధికార సిబ్బంది

● కూలీలకు పని కావలంటే 4 నుండి 5 కిలోమీటర్ల నడవల్సిందే.. ● అంత దూరం నడవలేక పనులకు దూరం అవుతున్నా కూలీలు ● పనులకు పోతే తప్ప పుటాగడవని..కుటుంబాల పరిస్థితి దేవునికి ఎరుగు

**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 31:-**బొమ్మనహాల్ మండలంలోని పలు గ్రామాలలో జరుగుతున్న విబిజి-రామ్ జి,(ఉపాధి హామీ పనులు)కూలీలు పనుల కోసం ప్రతిరోజూ దాదాపుగా 4 నుంచి 5 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెద్ద పెద్ద గ్రామాల్లో పనులు లేకపోవడంతో దూర ప్రాంతాల్లో కేటాయించిన పనులకు వెళ్లక తప్పడం లేదని, పని ప్రదేశానికి చేరుకునే లోపే దేవుడు కనపడుతున్నారనీ కూలీలు వాపోతున్నారు,ఇది ఇలా ఉండగా మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల పూడికతీత,కాలువల మరమ్మతులు,మట్టి పనులు, మొక్కల సంరక్షణ వంటి ఉపాధి పనులకు అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని ప్రారంభించకపోవడం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు స్వగ్రామంలో పనులు కల్పిస్తే కొంత వరకు వృద్దులు, మహిళలు,సులభంగా



ఉపాధి పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు,ప్రస్తుతం గాలి దేవుడు ప్రభావానికి వరుణుడు కురవకోపోవడంతో మండలంలో ఎక్కడ కూడ వర్షాభావ పరిస్థితులు లేక పొలం వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గిపోయాయి.అనేక ప్రాంతాల్లో పంట పొలాల్లో ఉన్న బోర్లు ఎండిపోవడం,పంటలు వాడిపోవడం వల్ల రైతులు, ఎంతగానో నష్టపోవడం జరిగిందని వ్యవసాయ కూలీలు వాపోతున్నారు,ఈ క్లిష్ట పరిస్థితుల్లో విబిజి-రామ్ జి,(ఉపాధి హామీ)పనులే వేలాది నిరుపేద కుటుంబాలకు ప్రధాన జీవనాధారంగా మారాయని కూలీలు చెబుతున్నారు, అయితే పనులు గ్రామాలకు దూరంగా ఉండటంతో రోజూ గంటల తరబడి నడిచి వెళ్లాల్సి రావడం, తిరిగి ఇంటికి చేరేసరికి శారీరకంగా అలసిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇది ఇలా ఉండగా మండలంలోని ప్రస్తుతానికి పలు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులు ప్రదేశాలను వైపు టెక్నికల్ అసిస్టెంట్లు,ఇంజినీరింగ్ అసిస్టెంట్లు,మండల అధికారి ఏపీఓ కానీ క్షేత్రస్థాయిలో తిరిగి చూసిన పాపాన పోలేదని కూలీలు ఆరోపిస్తున్నారు.పని ప్రదేశాల్లో ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడం వల్ల తమ సమస్యలు అధికారుల దృష్టికి వెళ్లడం లేదని,కూలీలు సమస్యలు చెప్పుకునే పరిస్థితి కూడా లేదని పేర్కొన్నారు, గ్రామాల్లోనే ఉపాధి హామీ పనులు కూలీలకు అనుకూల పైన స్వంత గ్రామాలలో ప్రారంభించి, అవసరమైన కొత్త పనులకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని, అధికారులు పని ప్రదేశాలను సందర్శించి కూలీల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని మండలంలోని పలు గ్రామాల కూలీలు కోరుతున్నారు,కనీసం వర్షాలు పడే వరకు ఉపాధి హామీ పనులే తమ కుటుంబాలకు ఆధారమని ఇందుకు అధికారులు స్పందించి గ్రామాల సమీపం లోనే పనులు కల్పించాలని మండలంలో ఉన్న విబిజి-రామ్ జి,(ఉపాధి హామీ) కూలీలు వాపోతున్నారు.

# మంచి వ్యక్తిత్వం, మచ్చలేని సేవలు..

## మనిషి జీవితాన్ని పరిమళింపజేస్తాయి

## పదవీ విరమణ సన్మాన సభలో జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి.

**కడప,మన జనప్రగతి జులై 31:-** మంచి వ్యక్తిత్వం, విధి నిర్వహణలో మచ్చలేని సేవలు ఒక ఉద్యోగి యొక్క జీవితాన్ని ప్రశంసల కుసుమాలతో పరిమళింపజేస్తాయని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ లోని సభా భవన్ లో.. జీఎస్ ఎస్ఎస్ ఎస్డీసి శంషున్నిసా బేగం, డిజాస్టర్ మేనేజ్మెంట్ డిప్యూటీ కలెక్టర్ హరిప్రసాద్, కలెక్టరేట్ పరిపాలనధికారి గంగయ్య ల పదవీ విరమణ ఆత్మీయ అభినందన సభకు జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...విధి నిర్వహణలో ప్రజల జీవితంలోకి తొంగి చూసినపుడే.. వారి స్థితిగతులు, సాధక బాధలు అర్థం అవుతాయన్నారు. విధి నిర్వహణలో పారదర్శకంగా పని చేసినప్పుడే.. అధికారులకు అన్ని స్థాయిల నుండి గుర్తింపు, ప్రశంసలు అందుతాయన్నారు. 30 ఏళ్ళ పైబడిన తమ రెవెన్యూ సర్వీసులో వీరు అనేక కీలకమైన బాధ్యతలను నిర్వహించారన్నారు. వీరందరూ ఒకే రోజు పదవీ విరమణ పొందడం రెవెన్యూ సర్వీసులో వారి బాధ్యతాయుతమైన సేవలను గుర్తు చేస్తుందన్నారు. ముఖ్యంగా కలెక్టరేట్ పరిపాలనధికారిగా తన.పరిధిలో గంగయ్య అత్యంత సుపరిచితంగా నిర్వహించిన భాధ్యతయుత విధులను జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు.జీవితంలో ప్రతి వ్యక్తికి కుటుంబం అనేది ఒక బాధ్యతాయుతమైన బంధం అని.. పదవీ విరమణ తర్వాత ఎలాంటి ఉద్యోగ ఒత్తిళ్ళ లేని.. ప్రశాంత శేష జీవనాన్ని కుటుంబ సభ్యులతో గడిపేందుకు ప్రధాన్యతనివ్వాలన్నారు. ఎంతో కాలం పాటు.. ఉద్యోగ జీవితంలో పై అధికారులకు సహకారం అందించిన ఉద్యోగులను జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు. పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి ఒక మధుర జ్ఞాపకం అని.. అలాంటి రోజును ఆనందంగా గడిపేలా.. ఉద్యోగులు అందరూ కూడా బాధ్యతాయుతంగా పనిచేసేయాలని, ఉద్యోగ కాలమంతా కర్తవ్య నిబద్ధతతో పని చేయాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్.. శంషున్నిసా బేగం, హరిప్రసాద్, గంగయ్య లను శాలువా, పూలమాలలతో సన్మానం చేశారు. ఆయా విభాగాల ఉద్యోగులు జ్ఞాపికలను బహూకరించారు.ఇంచార్జి డిఆర్వో మల్లికార్జునుడు, ఎస్డీసి వెంకటపతి, డిప్యూటీ కలెక్టర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ లోని అన్ని సెక్షన్ల సూపరింటెండెట్లు, సీనియర్ అసిస్టెంట్లు, తదితర రెవిన్ సిబ్బంది పాల్గొన్నారు




PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174